

- మద్యం షాపుల్లో మామూళ్ల దందా
- ఒక్కో దుకాణం నుంచి నెలకు రూ.1.25 లక్షలకు పైగా ఇవ్వాల్సిందే
- ప్రజాప్రతినిధులు, ఎక్సైజ్, పోలీసు అధికారులకు వాటాలు
- నెలకు రూ.కోటికి పైగా చేతులు మారుతున్న వైనం
- మామూళ్ల మత్తులో కళ్లకు గంతలు కట్టుకున్న నిఘా యంత్రాంగం

లంచం.. లాంఛనం...!



మద్యం వ్యాపారంలో లంచం.. లాంఛనంగా మారింది. చట్ట విరుద్ధంగా జరిగే పని నేరంగా కాక ఆనవాయితీ అయింది. నిబంధనలను తుంగల్లో తొక్కడం వల్లే మద్యం వ్యాపారం అత్యంత లాభసాటి అయ్యాక నెల నెలా మామూళ్లు సమర్పించుకోవాల్సిందే. లంచాలు ఇచ్చే వాళ్లకు ఇది తప్పనిసరి. తీసుకొనేవాళ్లు హక్కుగా భావించే పరిస్థితి వచ్చింది. కాదు.. కూడదంటే అధికారులకు నిబంధనలు గుర్తుకొస్తాయి. కేసులు నమోదు చేస్తారు. ఇంకా దూరంపోయి లైసెన్స్ రద్దు చేస్తామంటారు. ఒక్కో మద్యం దుకాణం నుంచి రూ.లక్ష నుంచి రూ.1.25 లక్షల చొప్పున అంటే.. నెలకు రూ.కోటికిపైగా చేతులు మారుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇందులో నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, కొందరు ఎక్సైజ్, పోలీసు అధికారులకు వాటాలు అందుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

కర్నూలు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పర్యవేక్షణ ఉన్న ఏడు స్టేషన్ల పరిధిలో 110 మద్యం షాపులు, 23 బార్లు ఉన్నాయి. వైసీపీ హయాంలో నూతన మద్యం పాలసీ పేరిట ప్రభుత్వమే మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం అమ్మకాలు చేసింది. సంపూర్ణ మద్య నిషేధం 2019 ఎన్నికల్లో వైసీపీ హామీ. కానీ అధికారంలోకి వచ్చాక జగన్ మాట మార్చారు. ధరలు పెంచితే మద్యం మానేస్తారని మద్య నిషేదానికి కొత్త నిర్వచనం చెప్పి ఇష్టారాజ్యంగా ధరలు పెంచేశారు. ప్రముఖ బ్రాండ్ల మద్యం సరఫరా ఆపేసి.. ఇచ్చింది తాగండి..! అన్నట్లు మునుపెన్నడు చూడని బ్రాండ్లను ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అమ్మకాలకు పెట్టారు. దీనిపై మద్యం ప్రియుల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం అమ్మకాల పాలసీని రద్దు చేసింది. లాటరీ ద్వారా మద్యం దుకాణాలు లైసెన్స్ విధానం అమలులోకి తెచ్చింది. ప్రైవేటు వ్యాపారులకు అప్పగించారు. అంతేకాదు.. ప్రముఖ బ్రాండ్లు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ధరలు కూడా తగ్గించారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన అనుమతి లేని మద్యం, నాటు సారాను నియంత్రించాలనే లక్ష్యంగా రూ.99కే క్వాటర్ నాణ్యమైన లిక్కర్‌ను తీసుకొచ్చారు. ఫలితంగా గత ప్రభుత్వ హయాంలో నెలకు సగటున రూ.65-70 కోట్ల మద్యం అమ్మకాలు జరిగితే.. ప్రస్తుతం రూ.95-105 కోట్లకు పైగా విక్రయాలు జరుగుతున్నాయని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు పేర్కొంటున్నారు. అదే స్థాయిలో నెల మామూళ్లు కూడా పెంచేశారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

రాజకీయ నేతలకు రూ.కోటికి పైగా వాటాలు?

రాజకీయ ప్రముఖ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఎక్సైజ్, పోలీసు అధికారులకు మద్యం ఆదాయ వనరుగా మారింది. మద్యం అమ్మకాలు జరిగేదీ లేనిదీ మీరు చూసుకోవాల్సిందే..! మాకు మాత్రం నెలనెలా మామూళ్లు ఇవ్వాలందే అన్నట్లుగా కొందరు అధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎక్సైజ్ అధికారులు కొందరు మామూళ్లు వసులు చేసే ఏజెంట్లుగా మారారనే ఆరోపణలు ఉన్నాయి. మద్యం అమ్మకాలను బట్టి ఒక్కో దుకాణం నుంచి నెలనెలా రూ.లక్ష నుంచి రూ.1.25 లక్షలకు పైగా మామూళ్ల కింద ఇచ్చుకోవాల్సి వస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. ఇంత జరిగినా మామూళ్లు ముట్టజెప్పడం, తీసుకోవడం లాంచనంగా మారిందనే విమర్శలు ఉన్నాయి.



నియోజకవర్గానికి చెందిన ముఖ్య ప్రజాప్రతినిదికి రూ.45-50 వేలు, కొందరు ఎక్సైజ్ అధికారులకు రూ.45 వేలు, సంబంధిత పోలీస్ స్టేషన్‌కు రూ16-20 వేల వరకు వస్తుందని పేరు బయటకు చెప్పుకోలేని ఓ మద్యం వ్యాపారి వాపోయాడంటే ఏ స్థాయిలో అవినీతి పేరుకుపోయిందో తెలుస్తున్నది.

మిగతా 7వ పేజీలో

పాతుకుపోయారు..

రెవెన్యూ కార్యాలయమే వారి అడ్డా

- రెవెన్యూ ఉద్యోగుల బదిలీలలో పైరవీలు
- అదేస్థానంలో కొనసాగింపు
- డిప్యుటేషన్ కోసం జాయింట్ కలెక్టర్‌కు ఫైలు
- బదిలీ అయిన ఉద్యోగులకు రిలీవ్ చేయని రెవెన్యూ అధికారులు
- గాడి తప్పిన రెవెన్యూ శాఖ



జిల్లా కలెక్టర్ కార్యాలయం

పాలనాపరంగా రెవెన్యూ శాఖ అత్యంత కీలకమైనది. డీఆర్వో కార్యాలయంలో కొందరు ఉద్యోగులు కొన్నేళ్లుగా పాతుకుపోయారు. రెవెన్యూ శాఖ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపణలున్నాయి. రెవెన్యూ సెక్షన్‌లో జరిగే బదిలీలు, పదోన్నతులు వంటి అంశాలను కింది స్థాయి ఉద్యోగులకు చేరవేసి అవరోధంగా తయారవుతున్నారు. ఇటీవల రెవెన్యూ ఉద్యోగుల బదిలీలు జరిగాయి. ఈ బదిలీల్లో డీఆర్వో కార్యాలయంలో కొందరు ఉద్యోగులు పైరవీలు చేశారన్న విమర్శలున్నాయి. ఐదేళ్లు దాటిన వారికి తప్పనిసరిగా బదిలీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ప్రభుత్వ ఉత్తర్వులను తుంగలో తొక్కి మరలా అదే సెక్షన్‌లో ఆదేస్థానం లేదంటే మరొక సెక్షన్‌లో స్థానాన్ని ఉన్నతాధికారులు కేటాయించారు. కొందరిని డిప్యుటేషన్‌పై కొనసాగించడానికి మరలా జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఫైల్ పెట్టడం కొసమెరుపు. దీంతో పాలన గాడితప్పిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మిగతా 6వ పేజీలో

న్యూస్ బాక్స్

పీజీ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ(ఆర్‌యూ)లో గడిచిన జనవరిలో జరిగిన పీజీ మూడో సెమిస్టర్ ఫలితాలను ఉపకులపతి వి. వెంకట బసవరావు బుధవారం విడుదల చేశారు. రెగ్యులర్ విభాగంలో 264మంది విద్యార్థులకుగాను 248 మంది, అనుబంధ కళాశాలల్లో 147 మంది విద్యార్థులకు 134 మంది, సప్లమెంటరీ విభాగంలో 11 మందికి ఏడు గురు, అనుబంధ కళాశాలల్లో 54మందికి 32 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. మరిన్ని వివరాలకు సంబంధించి యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

సీఎస్ఆర్ఎంవోగా సతీష్

కర్నూలు హాస్పిటల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సివిల్ సర్జన్ ఆర్ఎంవో డా.బి. వెంకటేశ్వరరావు గుంటూరు జీజీహెచ్ సీఎస్ఆర్ఎంవోగా బదిలీ అయ్యారు. గుంటూరు సీఎస్ఆర్ఎంవోగా పని చేస్తున్న డా. సతీష్ కుమార్‌ను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సీఎస్ఆర్ఎంవోగా బదిలీ చేశారు. మంగళవారం రాత్రి డైరెక్టర్ ఆఫ్ హెల్త్ నిర్వహించిన బదిలీల కౌన్సిలింగ్‌లో ఈ మార్పులు జరిగాయి.

లా పరీక్షల్లో ఇద్దరు డీబార్

కర్నూలు అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో 6, 10 లా సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డీబారు అయ్యారు. బుధవారం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని నిర్వహించిన పరీక్షల్లో 6వ సెమిస్టర్‌కు 245 మంది దరఖాస్తుచేసుకోగా 243 మంది హాజరయ్యారు. వారిలో ఇద్దరిని డీబారు చేశామని పరీక్షల విభాగం కంట్రోలర్ వెంకటేశ్వర్లు తెలిపారు. పదో సెమిస్టర్ పరీక్షకు 31మంది దరఖాస్తు చేసుకోగా 29 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి

శ్రీశైలం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానంలో పనిచేసే ఉద్యోగులు విధులు సక్రమంగా నిర్వహించాలని శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు ఆదేశించారు. శ్రీశైలంలో పరిపాలనాంశాల పరిశీలనలో భాగంగా బుధవారం శ్రీశైల క్షేత్ర సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ అన్ని విభాగాల ఉద్యోగులు కూడా పరస్పర సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు.

ఆయుష్షును పెంచుకునేందుకే యోగా




మాట్లాడుతున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

- పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు
- వేలాదిగా తరలివచ్చిన ఉద్యోగులు, విద్యార్థులు, అధికారులు
- మధ్వమార్గ్ కారిడార్‌లో యోగాంధ్ర



మంత్రాలయం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషి ఆయుష్షును పెంచుకునేందుకు యోగా అవసరమని మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు పేర్కొన్నారు. బుధవారం శ్రీమఠం మహా ముఖద్వారం వద్ద మధ్వమార్గ్ కారిడార్‌లో రామవేంద్రస్వామి మఠం సౌజన్యంతో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధ్యక్షతన 11వ అంతర్జాతీయ యోగా మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆదోని సబ్ కలెక్టర్‌తోపాటు ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, మంత్రాలయం ఎస్ఐ రామాంజులు తహసీల్దార్ రమాదేవి, సెట్కూరు సీఈవో డా.వేణుగోపాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ జ్యోతి ప్రజ్వలన చేసి యోగాను ప్రారంభించారు. యోగా గురువులు ఆయుష్ డా. ప్రసాద్, మునిస్వామి, వారి బృందం అనుసరించిన విధంగా వేలాదిగా తరలివచ్చిన ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ రుషులు, మునులు యోగా చేసి ఆయుష్షును పెంచుకున్నారన్నారు. యోగా చేయడంతో శరీరాన్ని, శ్వాసను, అవయవాలను, మనస్సును ఆరోగ్య వంతంగా ఉంచుకోవచ్చన్నారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్-2047లో హ్యాపీ లివింగ్‌లో భాగంగా యోగా ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన భరతనాట్యం, యోగాసనాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టూరిజం జిల్లా అధికారి విజయ, డీపీవో భాస్కర్, ఎంపీడీవో నూర్జహాన్, తహసీల్దార్‌లు రుద్రగౌడు, ఫణింద్ర, రజనీకాంత్, రాజశేఖర్, భక్తవత్సల, ఎంఈవోలు రాగన్న, ఖైనుద్దీన్, గ్రామ కార్యదర్శులు వేణుగోపాల్, ఇనత్ బాషా, మహేష్, డీటీలు జీకే గురురాజరావు, శశిశేఖర్‌రావు, ఆర్ఐ జనార్దన్ రావు, జయరామిరెడ్డి, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ప్రైవేటు పాఠశాలల ప్రిన్సిపాల్స్, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



యోగా చేస్తున్న ఉద్యోగులు, అధికారులు

సమగ్ర శిక్షలో బదిలీ షెడ్యూల్ విడుదల

- మ్యూచువల్స్‌కు మాత్రమే అవకాశం
- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ



ఆలూరు కేజీబీవీ విద్యాలయం

ఆలూరు, జూన్18(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) పరిధిలోని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రాజెక్టు కో ఆర్డినేటర్ బి. శ్రీనివాసరావు నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లాలో ఉన్న కేజీబీవీ, ఎంఆర్సీ కేంద్రాలు, భవిత భవన, మోడల్ హాస్టల్స్‌లో విధులు నిర్వహించే సిబ్బంది మ్యూచు వల్ బదిలీలకు మాత్రమే అవకాశం కల్పించారు. కేజీబీవీలో టీచింగ్, నాన్ టీచింగ్, సీఆర్ఎంటీ, మండల స్థాయి అకౌంటెంట్లు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, ఆఫీసు సబార్డినేట్లు, సైట్ ఇంజనీర్లకు అవకాశం కల్పించారు. ఈనెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. 23న సీనియారిటీ జాబితా తయారు చేసి 24న ప్రకటిస్తారు. 27న అభ్యంతరాలు స్వీకరిస్తారు. 28న తుది జాబితా ప్రకటిస్తారు. 30 నుంచి జూలై 2వ తేదీ మధ్య బదిలీల ఉత్తర్వులిస్తారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడి బలి

7

బోర్డులతో బోల్తా కొట్టించారు

ఎయిర్‌పోర్టు అభివృద్ధికి రూ.8.033 కోట్లు : మంత్రి బీసీ



బనగానపల్లె, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఎయిర్‌పోర్టు అభివృద్ధి కోసం రూ.8 కోట్లకు అనుమతి లభించిందని రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక వనరుల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కర్నూలు ఎయిర్‌పోర్టులో అభివృద్ధి పనులకు 2025-26 సంవత్సరానికి విమానాశ్రయం కార్యకలాపాల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. రన్‌వేస్ అండ్ సేఫ్టీని సరిదిద్దడానికి ఇతర నిర్వహణ పనులకు రూ.3.6 కోట్లు, కర్నూలు ఎయిర్‌పోర్టులో ప్రైవేటు ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ అందించడానికి రూ.4.433 కోట్లకు అనుమతి లభించాయన్నారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

పది మంది ఎస్ఐల బదిలీ

కర్నూలు క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 10 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఉత్తర్వులు జారీ చేశారు.

రామస్వామి	వీఆర్	ఆదోని త్రీటౌన్
వి.శ్రీనివాసులు	డీసీఆర్‌బీ	ఎమ్మిగనూరు టౌన్
ఎర్రన్న	కర్నూలు	ఎమ్మిగనూరు ట్రాఫిక్
వరలక్ష్మీ దేవి	వీఆర్	కర్నూలు మహిళా పీఎస్
జి.కృష్ణమూర్తి	తుగ్గలి	క్రిష్ణగిరి
బాలనరసింహులు	కర్నూలు	తుగ్గలి
మల్లికార్జున	క్రిష్ణగిరి	కర్నూలు త్రీటౌన్
మారుతీ	వీఆర్	హాలహర్వి
జి.చంద్ర	హాలహర్వి	కర్నూలు త్రీటౌన్
జి.చంద్రమోహన్	కర్నూలు	వీఆర్

20న స్విమ్మింగ్ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఒలింపిక్ డే సంబరాల సందర్భంగా ఈ నెల 20న నగరంలోని ఓల్డ్ రఘునాథ్ టాకీస్ వద్ద ఉండే స్విమ్మింగ్ ఫూల్‌లో అం డర్-18 విభాగంలో స్విమ్మింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మాస్టర్ స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రతినిధి జేఎల్ఎన్ రెడ్డి ఆధ్వర్యంలో 18 సంవత్సరాల లోపు క్రీడాకారులకు పలు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమాచారం కోసం సెల్.నెం.9440251668ను సంప్రదించాలని కోరారు. విజేతలకు మెడల్స్ ప్రతిభ, ప్రశంసాపత్రాలు అందజేస్తామని వివరించారు.

డేటా ఎంట్రీపై ఉచిత శిక్షణ

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 26 నుంచి డేటా ఎంట్రీపై ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆకళాశాల ప్రిన్సిపాల్ శశికళ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డొమెస్టిక్ డాటా ఎంట్రీ కోర్సుకు ఇంటర్, ఆపై చదివినవారు, పైథాన్‌కు డిగ్రీ, బీటెక్ కంప్యూటర్ చదివినవారు అర్హులని పేర్కొ న్నారు. కోర్సు పూర్తిచేసిన వారికి రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపుతో కూడిన సర్టిఫికెట్ ఇసా్తమని, శిక్షణ అనంతరం ఆయా కంపెనీలతో ఉద్యోగాలు కల్పిస్తారని వివరించారు. అర్హులైన యువతీ యువకులు స్కిల్‌డెవలప్‌మెంట్ వెబ్‌సైట్ ద్వారా రిజిస్టర్ చేసుకో వాలని, శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు వారి విద్యార్హత పత్రాలు, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలతో హాజరుకావాలని కోరారు.

మహానందిలో ఆర్‌అండ్‌బీ సీఈ పూజలు



వేదపండితుల ఆశీర్వాదం పొందుతున్న ఆర్‌అండ్‌బీ సీఈ వెంకటేశ్వరరావు

మహానంది, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో బుధవారం ఆర్‌అండ్‌బీ సీఈ వెంకటేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ముఖద్వారం వద్ద అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో సీఈ మహానందీశ్వరుడికి, కామేశ్వరీదేవి అమ్మవారికి అభిషేకార్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో వీరిని వేదపండితులు ఆశీర్వదించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పసుపుల సుబ్బారెడ్డి శాలువాతో సన్మానించారు వీరివెంట నం ద్యాల జిల్లా ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, కడప జిల్లా ఈఈ కృష్ణారెడ్డి ఉన్నారు.

రైతులే ధర నిర్ణయించేలా ఎదగాలి

- 964 మంది రైతులకు రూ.1.99 కోట్ల రాయితీ
- వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ చేసిన కలెక్టర్



రైతులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పండించిన పంటకు ధర నిర్ణయించే స్థాయికి రైతులు ఎదగాలని నంద్యాల కలెక్టర్ రాజకుమారి ఆకాంక్షించారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద జిల్లాలో 964మంది చిన్న, సన్నకారు రైతులకు రూ.1.99 కోట్ల వ్యవసాయ పరికరాల రాయితీని ప్రభుత్వం విడుదల చేసినట్లు ఆమె పేర్కొన్నారు. బుధవారం నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో వ్యవసాయ యాంత్రీకరణ సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెషనైజేషన్ పథకం కింద వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ రాజకుమారి, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, జిల్లాలోని సహాయ వ్యవసాయ అధికారులు, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు. రైతులకు విడుదల చేసిన రూ.1.99కోట్ల రాయితీ నిధుల చెక్కును కలెక్టర్ లబ్ధిదారులకు అందజేశారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించండి : సీఎస్

కర్నూలు కలెక్టరేట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కే.విజయానంద్ విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ జిల్లాలోని యోగా నిర్వహించే స్థలాలకు అవసరమైన వసతులు, సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. జూన్ 21న ఉదయం 7 గంటలకు అన్ని గ్రామ, మండల జిల్లా కేంద్రాల్లో ప్రోటోకాల్ ప్రకారం యోగా నిర్వహించాలని ఆదేశించారు.

27 ఏళ్ల తర్వాత ఫార్మసీ ఆఫీసర్ బదిలీ

ఆఫీసర్ బదిలీ నిలిపిన ఆర్‌డీ

కర్నూలు హాస్పిటల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఐ-హాస్పిటల్, కర్నూలు జీజీహెచ్‌లో లాంగ్ స్టాండింగ్‌లో ఉన్న ఇద్దరు ఫార్మసీ ఆఫీసర్లలో ఒకరి బదిలీని (రిటేషన్) నిలిపివేసి, మరో ఫార్మసీ ఆఫీసర్‌ను పీహెచ్‌సీకి కడప ఆర్‌డీ బదిలీ చేశారు. మంగళవారం అర్ధరాత్రి వరకు కడప ఆర్‌డీ.. డీఎంహెచ్‌వో ఆఫీసరుతో జూమ్ బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించారు. జోనల్‌లో అత్యధికంగా లాంగ్ స్టాండింగ్‌లో ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో పని చేస్తున్న వి. విజయ లక్ష్మి ఆఫీస్ బేరర్ సర్టిఫికెట్ మొదటిసారిగా ఉపయోగించుకోవడంతో ఆమె బదిలీని కడప ఆర్‌డీ నిలిపేశారు. ఆ తర్వాత కర్నూలు జీజీహెచ్‌లో 27 ఏళ్లుగా లాంగ్ స్టాండింగ్‌లో ఉన్న ఫార్మసీ ఆఫీసర్ బి. కృష్ణమోహన్‌శర్మను ఉలిందకొండ పీహెచ్‌సీకి బదిలీ చేశారు. కర్నూలు జీజీహెచ్‌కు గోనెగండ్ల ఫార్మసీ ఆఫీసర్ డా. జగదీష్‌ను గోనెగండ్ల పీహెచ్‌సీకి, దైవందిన్నె పీహెచ్‌సీకి చెందిన రామకృష్ణను ఉలిందకొండ నుంచి వీరాంజనేయులు బైర్లూటికి, పెద్దతుంబలం నుంచి దైవందిన్నెకు హేమలత, పుచ్చకాయలమడ పీహెచ్‌సీ నుంచి కమ్మరచెడు పీహెచ్‌సీకి సురేంద్రబాబును బదిలీ చేశారు. పెద్దతుంబలానికి నాగరాజు, పుచ్చకాయలమడకు రామకృష్ణారెడ్డి, కల్లూరుకు శిరోమణి బదిలీ అయ్యారు. అయితే జోనల్ క్యాడర్‌లో 31 ఏళ్ల లాంగ్ స్టాండింగ్‌లో ఉన్న ఫార్మసీ ఆఫీసర్ బదిలీని నిలిపివేయడంపట్ల జూమ్ కౌన్సిలింగ్‌లో కొందరు ఫార్మసీ ఆఫీసర్లు నిలదీసినట్లు తెలిసింది.

పాతుకుపోయారు..



కర్నూలు కలెక్టరేట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ కార్యాలయంలో పని చేసే కొందరు ఉద్యోగులకు కొన్నేళ్లుగా రెవెన్యూ కార్యాలయం అడ్డాగా మారింది. ప్రభుత్వాలు మారినా, వేరే ప్రాంతాలకు బదిలీ అయినా కూడా అదేస్థానంలో కొన్ని సంవత్సరాల నుంచి నేటికీ కొనసాగుతున్నారు. డీఆర్వో కార్యాలయంలో వీరు కొన్ని సంవత్సరాలుగా పాతుకుపోవడంతో జిల్లా రెవెన్యూ శాఖ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపణలున్నాయి. రెవెన్యూ సెక్షన్‌లో జరిగే బదిలీలు, పదోన్నతులు వంటి అంశాలను కింది స్థాయి ఉద్యోగులకు చేరవేసి అవరోధంగా తయారయ్యారన్న విమర్శలున్నాయి. డీఆర్వో కార్యాలయం నుంచి బదిలీ అయితే డీఎస్‌వో ఆఫీసుకు, మరలా బదిలీ అయితే.. డీఎస్‌వో నుంచి డీఆర్వో కార్యాలయానికి బదిలీ వస్తున్నారు. డీఆర్వో కార్యాలయంలోని ఏ నుంచి హెచ్ వరకు సెక్షన్‌లో కొన్ని సంవత్సరాలుగా పని చేస్తున్న కొందరు ఉద్యోగులు ఉన్నతాధికారులను శాసించే స్థాయికి ఎదిగారు. బదిలీలలో స్థానం మారినా కూడా ముడుపులతో సరిపుచ్చి డిప్యుటేషన్‌పై నేటికి కొనసాగుతున్నారు. రెవెన్యూ శాఖలో బదిలీలు పూర్తయ్యాయి. బదిలీల్లో నూతన స్థానాలు కేటాయించారు. నూతన స్థానాలు కేటాయించినా ఇంకా జిల్లా రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. బదిలీ ఉత్తర్వులు పొందిన ఇతర స్థానాల ఉద్యోగులు కొత్తస్థానాలకు వచ్చారు. పాత స్థానాల్లో కొనసాగుతున్న రెవెన్యూ కార్యాలయంలోని ఉద్యోగులను రిలీవ్ చేయకుండా 11 రోజులుగా రెవెన్యూ అధికారులు ఉత్తర్వులు ఇవ్వడం లేదు. అధికారులు కాలయాపన చేస్తున్నారని విమర్శలు వెలువెత్తుతున్నాయి.

నామాటే శాసనం..

క్రిష్ణగిరి మండలం ఎమ్మార్వో కార్యాలయానికి చెందిన రెవెన్యూ అధికారి డీఆర్వో కార్యాలయంలోని ఏ-సెక్షన్‌లో అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు లేకుండా నేటికి అనధికారికంగా పని చేస్తున్నారు. క్రిష్ణగిరి ఎమ్మార్వో కార్యాలయంలో పని చేస్తున్నారా... డీఆర్వో కార్యాలయంలో పని చేస్తున్నారా అని ఆయనపై అనేక సందేహాలు వ్యక్తమవతుఉన్నాయి. ఆయనను ఎవరు అడిగినా డిప్యుటేషన్‌పై కొనసాగుతున్నాను.. మరికొందరు అడిగితే ఉన్నతాధికారులు పిలిచారు కాబట్టి డీఆర్వో కార్యాలయానికి వచ్చానని సమాధానం చెబుతున్నారు. నేడు ఆయన మీద వీరాభిమానంతో ఏ సెక్షన్‌లో డిప్యుటేషన్‌పై కొనసాగించడానికి ఇటీవల జాయింట్ కలెక్టర్‌కు ఫైల్ పెట్టారు. పదోన్నతులు, బదిలీలు తదితర రెవెన్యూ అంశాల్లో ఆయన విపరీతమైన జోక్యం చేసుకుంటున్నారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఇటీవల గ్రేడ్-2 వీఆర్వో పదోన్నతుల నుంచి గ్రేడ్-1 పదోన్నతులు కల్పిస్తానని కొందరు వీఆర్వోలకు ఆశ కల్పించినట్లు సమాచారం. అదే విధంగా జిల్లా ఉన్నతాధికారులకు అందుతున్న ఆకాశరామన్న ఉత్తరాల ప్రమేయంపై ఆయన మీద సందేహాలు వ్యక్తమవుతున్నాయి..

రెండు రోజుల్లో రిలీవ్ చేస్తాం



బదిలీ అయిన ఉద్యోగులకు రెండులేదా మూడు రోజుల్లో రిలీవ్ చేస్తాం. బదిలీ అయిన స్థానాల్లో కొత్తవారు త్వరగా విధుల్లో చేరాలి. విధుల్లో చేరిన తర్వాత డీఆర్వో కార్యాలయంలో వీలైనంత త్వరగా నూతన స్థానాలను కేటాయిస్తాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీలు చేపట్టాం.

- వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి డీఆర్వో, కర్నూలు

బదిలీల్లో పైరవీలు

ఇటీవల రెవెన్యూ ఉద్యోగుల బదిలీలు జరిగాయి. ఈ బదిలీల్లో డీఆర్వో కార్యాలయంలో కొందరు ఉద్యోగులు పైరవీలు చేశారని ఆరోపణలున్నాయి. ఐదేళ్లు దాటిన వారికి తప్పనిసరిగా బదిలీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ప్రభుత్వ ఉత్తర్వులను తుంగలో తొక్కి మరలా అదే సెక్షన్‌లో అదే స్థానం లేదంటే మరొక సెక్షన్‌లో స్థానాన్ని ఉన్నతాధికారులు కేటాయించారు. ఏ సెక్షన్‌లో పనిచేస్తున్న ఏ1, ఏ7 దాదాపు పది సంవత్సరాలుగా అదేస్థానంలో మరలా బదిలీలలో నేటికి అదే పోస్టింగ్ ఇచ్చారు. బీ-సెక్షన్‌లోని బీ-1, సీ-సెక్షన్‌లోని సీ-1, డి-సెక్షన్‌లోని డీ-5, ఈ-సెక్షన్‌లోని ఈ-1, జీ-సెక్షన్‌లోని ఏ2, అలాగే మరికొందరు ఏడు నుంచి పదేళ్ల వరకు ఇక్కడే పని చేస్తున్నారు. కొందరిని డిప్యుటేషన్‌పై కొనసాగించడానికి మరలా జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఫైల్ పెట్టడం కొసమెరుపు. కొత్తవారికి అవకాశం ఇస్తే రెవెన్యూ శాఖ కార్యాలయం గాడిలో పడుతుందని ప్రజాసంఘాలు వ్యక్తం చేస్తున్నాయి.

లోకజ్ఞానం, క్రమశిక్షణ తప్పనిసరి

- అరుణభారతి వ్యవస్థాపకులు బీసీ రాజారెడ్డి
- 'పది' టాపర్లకు రూ.3 లక్షల ప్రోత్సాహకాలు



బనగానపల్లె మండల టాపర్ సాధించిన విద్యార్థినికి నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, జూన్ 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు లోకజ్ఞానం, క్రమశిక్షణ అలవర్చుకుంటేనే భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలను చేరుకోగలరని అరుణభారతి వ్యవస్థాపకులు, మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పిలుపునిచ్చారు. పదోతరగతిలో బనగానపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను సన్మానించారు. బనగానపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి బీసీ రాజారెడ్డి హాజరై ఒక్కో విద్యార్థికి రూ.50వేల చొప్పున ఆరుగురికి నగదు ప్రోత్సాహం, జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లిదండ్రులు బీసీ లక్ష్మమ్మ, బీసీ గుర్రెడ్డిల జ్ఞాపకార్థం విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించడంలో బీసీ కుటుంబం ముందుంటుదన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యార్థులు రాణించడం అభినందనీయమన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, ప్రముఖ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. పది తర్వాత ఇంటర్ విద్య అత్యంత కీలకమైన దశ అన్నారు. ఈ దశలో క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థానాలకు ఎదగాలన్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలన్నారు. ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులే ఐఏఎస్, ఐపీఎస్‌లు అయ్యారన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఎల్.వేణుగోపాల్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువుల పట్ల విద్యార్థులు గౌరవం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అరుణభారతి మధుసూధన్‌రెడ్డి, ఎంఈవో స్వరూప, హెచ్‌ఎం ప్రసాదరావు, జ్యోతిష్య పండిట్ వెంకటరాముడు, రిటైర్డు హెచ్‌ఎం. పక్కీర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాధిక, ప్రజావైద్యశాల డాక్టర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్య, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యత ఇచ్చిన పెండేకంటి



వెంకటసుబ్బయ్య జీవిత చరిత్ర పుస్తకావిష్కరణలో పాల్గొన్న పెండేకంటి బాలాజీ తదితరులు

బనగానపల్లె, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన గొప్పమేధావి మాజీ కేంద్రహోం శాఖామంత్రి, మాజీ గవర్నర్ పెండేకంటి వెంకటసుబ్బయ్య అని వాసవీ విద్యా సంస్థల సీఈవో పెండేకంటి బాలాజీ అన్నారు. పెండేకంటి వెంకటసుబ్బయ్య 104వ జయంతి పురస్కరించుకొని డాక్టర్ పాణ్యం వసుంధర రచించిన రాజనీతి ఘనాపాటి పెండేకంటి పేరుతో ఆయన జీవిత చరిత్ర విశేషాల పుస్తకా విష్కరణ కార్యక్రమం బనగానపల్లె మండలం ఇల్లూరు కొత్తపేట పెండేకంటి పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించారు. పుస్తక రచయిత పాణ్యం వసుంధరను పలువురు అభినందించారు. పెండేకంటి బాలాజీ మాట్లాడుతూ సామాన్యులకు విద్యను అందుబాటులో తెచ్చేందుకు వాసవీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో బనగానపల్లెలో ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాఖ్యాత డాక్టర్ శ్యాంసుదర శాస్త్రి, హనుమంతరావు, పార్థసారధి, డాక్టర్ శ్రీనివాసులు, పూర్వ విద్యార్థులు నాగ రాజు, పెండేకంటి రమణ్‌కుమార్, రాఘవేంద్ర, ఎన్నారై శ్రీధర్, బుడ్డా శ్రీకాంత్‌రెడ్డి, భూమా జగన్ తదితరులు పాల్గొన్నారు.

యోగా.. మన సంపద

- కలెక్టర్ రాజకుమారి
- ఆధ్యాత్మిక క్షేత్రంలో ఆసనాలు
- పాల్గొన్న రెండు వేల మంది



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్, జేసీ

ఆళ్లగడ్డ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాలు అనుసరిస్తున్న యోగాసనాలు మనదేశ వారసత్వ సంపద అని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. మన దేశంలో పుట్టిన యోగాను ప్రపంచవ్యాప్తంగా నిర్వహించుకోవడం గర్వంగా ఉందన్నారు. ఆధ్యాత్మిక క్షేత్రమైన అహోబిలంలో బుధవారం రెండు వేల మందితో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జేసీ విష్ణుచరణ్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి యోగాంధ్ర వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైతన్య ఆశ్రమం యోగా గురువు దామోదర కుమార్‌రెడ్డి యోగాసనాలు వేయించి వాటి గురించి వివరించారు. అనంతరం కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగక్రియలు అచరించి ఆధ్యాత్మిక, మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పొందాలని సూచించారు. నంద్యాల టెక్కె మార్కెట్ యార్డులో 5,200 మంది ప్రభుత్వ ఉద్యోగులతో థీమాటిక్ యోగాను విజయవంతంగా చేశామన్నారు. ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బనగానపల్లె బృందం ప్రదర్శించిన యోగా స్కిట్‌కు రాష్ట్ర స్థాయిలో బహుమతి రావడం అభినందనీయమన్నారు. యోగా శిక్షణకు సహకరించిన పతంజలి, రామకృష్ణ మిషన్, నేచర్ గురువులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సీఈవో సౌందర్యరాజన్, ప్రధాన అర్చకులు రమేష్, నంద్యాల ఆర్డీవో చల్లా విశ్వనాథ్, డీఎంహెచ్‌వో వెంకటరమణ, ఆయుష్ వైద్యాధికారి యశోధర, తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, ఎంపీడీవో నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.



సుస్థిరాభివృద్ధి కోసం..

- పండ్లు, పూలతోటల సాగుకు వంద శాతం రాయితీ
- రైతులకు 'ఉపాధి హామీ' బాసట
- సన్న, చిన్నకారు రైతులకు చక్కటి అవకాశం
- జిల్లాలో ఈ ఏడాది 4,700 ఎకరాల సాగు లక్ష్యం

శిరివెళ్ల, జూన్ 18(ఆంధ్రజ్యోతి) : ఆర్థికంగా వెనకబడిన సన్న, చిన్నకారు రైతులు సుస్థిరాభివృద్ధిని సాధించేందుకు వంద శాతం రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా పండ్లు, పూలతోటల పెంపకానికి ఉపాధి హామీ పథకం రైతులకు అండగా నిలుస్తోంది. పండ్ల తోటలు, మల్లె, గులాబీ తోటలు సాగు చేయాలనుకునే సన్న, చిన్నకారు రైతులకు భూమి చదును చేసే దగ్గర నుంచి మొక్కల సంరక్షణ వరకు ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తోంది. రైతన్నకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చేయూతనిస్తోంది. నంద్యాల జిల్లాలో గతేడాది 2,200 ఎకరాల్లో రైతులు రాయితీపై పండ్లు, పూల తోటలు సాగుచేయగా ఈ ఏడాది 4,700 ఎకరాల సాగు లక్ష్యాన్ని ఎంచుకున్నారు. ఇందుకు గాను గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు ఈఅవకాశాన్ని వినియోగించు కునేలా ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 2 వేల ఎకరాల్లో రైతులు వివిధ రకాల పండ్లు, పూలతోటలు సాగు చేశారు.

పండ్ల తోటలకు మూడేళ్లు..

మామిడి, అంజీర, చీని, నిమ్మ, జామ, తైవాన్ జామ, సపోట, దానిమ్మ, కొబ్బరి, సీతాఫలం, అల్లనేరేడు, చింత, ఆపిల్ బేర్, ఆయిల్ పామ్, డ్రాగన్ ఫ్రూట్, గుండు మల్లెలు, గులాబీ పూలు, మునగ తోటల సాగుకు ప్రభుత్వం రాయితీ కల్పిస్తోంది. పండ్ల తోటలకు మూడేళ్ల పాటు, పూల తోటలకు రెండేళ్ల పాటు నిబంధనల మేరకు నిధులు అందిస్తుంది. ఇందులో డ్రాగన్ ఫ్రూట్ సాగుకు 0.5ఎకరాలకు, గుండు మల్లెలు, గులాబీ, మునగ తోటల సాగుకు 0.25 నుంచి ఒక ఎకరాకు మాత్రమే రాయితీని అందిస్తారు. రైతులు ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగి ఉండి ఐదు ఎకరాల లోపు మాత్రమే సాగు భూమి కలిగి ఉన్న వారు అర్హులు. రైతులు తమ జాబ్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు నకలుతో గ్రామాల్లోని ఉపాధిహామీ క్షేత్ర సహాయకుల ద్వారా మండల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.



రాయితీపై సాగు చేసిన చీని తోటను చూపుతున్న రైతు

పూలతోటల సాగుకు..

రైతులు పూలతోటల సాగుకు ఆసక్తి చూపుతుండడంతో ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సాహం అందిస్తోంది. గుండు మల్లెల సాగుకు గరిష్ఠంగా ఎకరాకు 4 0 0 మొక్కలతో తోటను సాగుచేస్తే ఏడాదికి రూ.55,124 చొప్పున రెండేళ్ల పాటు అం దిస్తారు. గులాబీ పూల సాగుకు గరిష్ఠంగా ఎకరాకు 500 మొక్కలతో తోటను సాగు చేసిన రైతులకు ఏడాదికి రూ.62,355 చొప్పున రెండేళ్లు జమ చేస్తారు. అలాగే మునగ తోటకు గరిష్ఠంగా ఎకరాకు 112 మొక్కలకు గాను సంవత్సరానికి 27,515 చొప్పున రెండు సంవత్సరాలపాటు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు ఇస్తారు.

అవగాహన కల్పిస్తున్నాం



ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు పండ్లు, పూలతోటలు సాగు చేసేందుకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల్లోని క్షేత్ర సహాయకుల ద్వారా రైతులకు పథకం గురించి సమగ్ర వివరాలు అందజేస్తున్నాం. పండ్లు, పూలతోటల సాగు లాభదాయకంగా చేపట్టేందుకు వంద శాతం రాయితీపై రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నాం.

-సూర్యనారాయణ, డ్వామా పీడీ, నంద్యాల జిల్లా

రైతులు దరఖాస్తు చేసుకోవాలి

మల్లె, గులాబీ పూలతోటల పెంపకానికి అర్హత, ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలి. క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తాం. పండ్లు, పూలతోటల సాగుద్వారా రైతులకు వ్యవసాయం లాభసాటిగా మార్చేం దుకు వంద శాతం రాయితీ ఇస్తున్నాం.

-రామసుబ్బయ్య, ఏపీవో, శిరివెళ్ల



రైతులు సాగు చేసిన మల్లె తోట

జీజీహెచ్‌లో 12 మంది నర్సింగ్ సిబ్బంది బదిలీ

కర్నూలు హాస్పిటల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జీజీహెచ్‌లో 12 మంది హెడ్ నర్సులు బదిలీ అయ్యారు. వీరిలో హెడ్ నర్సులు జే. నిర్మల (లద్దగిరి), కే. ఉమాదేవి (అనంతపురం), సుభాషిణి ఆశీర్వాదం (అనంతపురం), సుగుణవతమ్మ (అనంతపురం), కే. సరస్వతి (తిరుపతి), ప్రమీల (తిరుపతి), వసంత (కడప), మాధవీలత (కడప), లక్ష్మీనరసమ్మ (గోనెగండ్ల పీహెచ్‌సీ నుంచి కర్నూలు జీజీహెచ్)కు శ్రీదేవి (రిటేషన్), జ్యోతి (రిటేషన్) అయ్యారు.

నవోదయ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి



ప్రిన్సిపాల్ పద్మావతి

ఎమ్మిగనూరు రూరల్, జూన్18(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 3, 4వ తరగతులు చదివి ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 01.05.2014 నుంచి 31.07.2016 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునేందుకు 29.07.2025 చివరి తేదీ అని, రాత పరీక్ష 13.12.2025 శనివారం రోజున ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు నవోదయ విద్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

లంచం.. లాంఛనం!

(5వ పేజీ తరువాయి)

ఈ లెక్కన జిల్లాలో 110 మద్యం దుకాణలు నుంచి నెలనెలా రూ.కోటికి పైగా వాటా రూపంలో పలువురి చేతులు మారుతున్నట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. జిల్లాలో పశ్చిమ ప్రాంతానికి చెందిన ఓ నియోజక వర్గంలో ముఖ్య ప్రజాప్రతినిధి ఒకరు ఒక్కో మద్యం షాపు నుంచి నెలనెలా రూ.50-75 వేలు తనకు తెచ్చి ఇవ్వాలని, తన అనుమతితో నిర్వహించే మద్యం దుకాణాల నుంచి మామూళ్లు తీసుకోరాదని ఓ ఎక్సైజ్ సీఐని ఆదేశించినట్లు సమాచారం. ఈ విషయాన్ని సదరు సీఐ జిల్లా ఉన్నతాధికారులకు చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. మరో నియోజకవర్గంలో ముఖ్య ప్రజాప్రతినిధి సోదరుడు మద్యం షాపులను సిండికేట్‌గా ఏర్పాటు చేసి లాభాల్లో తన వాటాగా 40 శాతం, లైసెన్స్‌దారులు, అనుచరులకు 60 శాతం ఇస్తున్నారని సమాచారం. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఓ నియోజకవర్గంలో ప్రతి దుకాణం నుంచి ఒక రేటు చొప్పున ముఖ్య రాజకీయకుడి నెల మామూళ్లు వెళ్తున్నాయనే ఆరోపణలు లేకపోలేదు. ఈ నియోజకవర్గంలో ఎక్సైజ్ సీఐ ఒకరు అన్నీతానై మద్యం షాపుల నుంచి నెల మామూళ్లు వసులు చేసి కొందరు రాజకీయ నాయకులు, అధికారులకు వాటాలు పంచుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

నేతల అండతో గ్రామాల్లో బెల్టుషాపులు

గ్రామాల్లో బెల్ట్ షాపులు పెడితే కఠిన చర్యలు ఉంటాయని ప్రభుత్వం పదేపదే చెబుతున్నా అమలు కావడం లేదు. జిల్లాలో ఏ పల్లెకు వెళ్లినా మద్యం బెల్ట్ షాపులు కనిపిస్తున్నాయి. నెలనెలా మామూళ్లు అందుతుం డడంతో ఎక్సైజ్ నిఘా యంత్రాంగం, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదు. మద్యం వ్యాపారంలో 30-40 శాతం వాటా బెల్ట్ షాపుల నుంచి వస్తుందని ఎక్సైజ్ అధికారి ఒకరు పేర్కొన్నారు. దీన్నిబట్టి ఇవి ఏ స్థాయిలో విస్తరించిందీ తెలుసుకోవచ్చు. కేసులు కోసం అప్పుడప్పుడు నామమాత్రపు దాడులతో సరిపుచ్చుతున్నారు. అంతేకాదు.. వైన్ షాపుల వద్ద, రోడ్లపైనే మద్యం తాగుతున్నా అడిగేవారు లేరు. షాపులను బార్లుగా మార్చేశారనే ఆరోపణలు ఉన్నాయి. కర్నూలు నగరంలో మదర్ థెరిసా సర్కిల్‌కు సమీపంలో నివాస గృహాల పక్కనే ఏర్పాటు చేసిన ఓ వైన్ షాపును బారుగా మార్చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నేషనల్ హైవే పక్కనే ఉన్న డాబాలు అనధికారిక బార్లుగా మార్చేసినా అడిగేవారు లేరు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, కోడుమూరు నియోజకవర్గం కేంద్రాల్లో వైన్ షాపుల వద్ద రోడ్లపైనే మద్యం సేవిస్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అయితే.. ప్రభుత్వం మద్యం అమ్మకాలు టార్గెట్ పెట్టిందని, బెల్ట్ షాపులు నియంత్రిస్తే.. టార్గెట్ సాధ్యం కాదని, తద్వారా ప్రభుత్వ ఆదాయం తగ్గుతుందని, అందువల్ల చూసీ చూడనట్లుగా వెళ్తున్నామని ఓ అధికారి పేర్కొనడం కొసమెరుపు.



మామూళ్లు ఇవాల్సిన అవసరం లేదు

మద్యం దుకాణాల లైసెన్స్‌దారులు ఎవరికీ మామూళ్లు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎవరైనా డిమాండ్ చేస్తే రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. అక్కడక్కడా బెల్ట్ షాపులు ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. నిఘా ఉంచి దాడులు చేస్తున్నాం.

- సుధీర్‌బాబు, సూపరింటెండెంట్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ, కర్నూలు

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడి బలి



విశ్వేశ్వరరెడ్డి (ఫైల్)

కొలిమిగుండ్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్‌కు మరో యువకుడు బలై య్యాడు. మండలంలోని ఎర్రగుడి గ్రామానికి చెందిన ఆవుల విశేశ్వరరెడ్డి(28) అనంతపురం జిల్లా తాడిపత్రి రైల్వేస్టేషన్‌లో రైలు కింద పడి బుధవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నాడు. విశేశ్వరరెడ్డి కొంత కాలంగా అన్‌లైన్ బెట్టింగులతో చాలా అప్పులు చేసినట్లు తెలుస్తోంది. దీంతో చేసిన అప్పులు తీర్చలేక, ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యకు ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ఇటీవల నెల రోజుల క్రితం ఓ యువకుడు అన్‌లైన్ బెట్టింగ్‌ల కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మరవక ముందే మరో యువకుడు బలి కావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తాడిపత్రి రైల్వే ఎస్‌ఐ నాగప్ప కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి దారుణ హత్య

నంద్యాల టౌన్, జూన్18 (ఆంధ్రజ్యోతి): నూనెపల్లె త్రీ టౌన్ పరిధిలో మంగళవారం రాత్రి దస్తగిరి (65) అనే వృద్ధుడు దారుణ హత్యకు గురయ్యాడు. రుద్రవరం మండలం కొండమాయపల్లెకు చెందిన దస్తగిరి గత కొన్ని ఏళ్ల కిందట ఇల్లు వదిలి వెళ్లి ఎప్పుడో ఒకసారి ఊరికి వచ్చేవాడు. నంద్యాలలో భిక్షాటన చేస్తూ జీవించేవాడు. అయితే రాత్రి గుర్తు తెలియన వ్యక్తులు ఆయన్ను హత్య చేశారు. ఈ ఘటన మద్యం మత్తులో జరిగిందా? లేక ఆయన వద్ద డబ్బు ఉంటే దాని కోసం అల్లరి మూకలు ఈ ఘాతుకానికి పాల్పడ్డారా..? అనేది తేలాల్సి ఉందని మూడో పట్టణ ఇన్‌చార్జి సీఐ ఈశ్వరయ్య తెలిపారు. మృతుడికి ఇద్దరు భార్యలు, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మ్యాన్‌హోల్‌లో పడి వృద్ధురాలి మృతి

నంద్యాల టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పరిధిలోని ఆర్జీసీ ప్రాంగణంలోని మ్యాన్‌హోల్‌లో పడి వృద్ధురాలు మృతి చెందారు. వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలివీ.. గుర్తు తెలియని వృద్ధురాలు ప్రమాదవశాత్తు మ్యాన్‌హోల్‌లో పడ్డారు. స్థానికులు గుర్తించి ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందారు. మృతురాలికి సంబంధించిన వారు ఎవరైనా వస్తే వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని సీఐ సూచించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కర్నూలు క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోట్ల రైల్వే స్టేషన్ వద్ద రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి శరీరంపై లైట్ పింక్ కలర్ ఫుల్ హ్యాండ్ షర్టు, నలుపు రంగు షార్ట్, నీలం, ఆకుపచ్చ గడులు ఉన్న పంచ ఉంది. మృతుడి ఎడమ చేతిపై నారాయణ అక్షరాలు ఉన్న పచ్చబొట్టు, కుడిచేతిపై తేలుబొమ్మ ఉన్న పచ్చనిబొట్టు ఉంది. మృతుడి వయస్సు 55ఏళ్లు ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనాథ్‌రెడ్డి, సెల్‌నెంబర్ 9441802327కు ఫోన్ చేయాలని తెలిపారు.

కువైట్ నుంచి చాగలమర్రికి చేరిన మహిళ

- ఎస్పీ ఆదేశాలతో ఎస్ఐ చర్యలు

చాగలమర్రి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధికై కువైట్‌కు వెళ్లి అక్కడ ఇబ్బందులు పడుతున్న మహిళను బుధవారం ఎస్ఐ సురేష్ చాగలమర్రికి రప్పించేలా కృషి చేశారు. చాగలమర్రికి చెందిన ఉసేనమ్మ కువైట్‌లో అవస్థలు పడుతూ, అక్కడి యజమానుల హింస భరించలేక పలుమార్లు నంద్యాల ఎస్పీ దృష్టికి వీడియో ద్వారా తీసికెళ్లింది. స్పందించిన ఎస్పీ మహిళకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని చాగలమర్రి ఎస్ఐని ఆదేశించారు. కువైట్‌కు పంపించిన కడప జిల్లా ఖాజీపేటలో ఉన్న ఏజెంట్ ద్వారా తిరుగు ప్రయాణం టికెట్‌ను ఎస్ఐ సురేష్ బుక్ చేయించారు. ఉసేనమ్మను చాగలమర్రికి తీసుకొచ్చారు.

కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యంగా పని చేద్దాం



సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేద్దామని మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లాలోని నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు, నగర అధ్యక్షుడు షేక్ జీలానీ బాషా, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేంద్రనాయుడు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి. బ్రతుకన్న ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షురాలు జిల్లా పర్యటన తీరుపై చర్చించారు. రాష్ట్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి అందరూ కృషి చేయాలన్నారు. నాయకులు బాబురావు, దామోదరం రాధాకృష్ణ, కాశీంవలీ, అనంతరత్నం మాదిగ ఉన్నారు.

బోర్డులతో బోల్తా కొట్టించారు..

- క్షణాల్లో బోర్డు మార్చిన నర్సింగ్ కాలేజీ యాజమాన్యం
- అప్పటి వరకు జూనియర్ కళాశాల ఆవెంటనే నర్సింగ్ స్కూల్
- కర్నూలులో ఉన్న కళాశాల అనుమతితో సర్టిఫికెట్లు
- అంధకారంలో విద్యార్థుల భవితవ్యం

ఉన్నవి లేనట్లు.. లేనివి ఉన్నట్లు





మరో చోట ఉన్న అసలైన ఆర్ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాల

ఆదోని అగ్రికల్చర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బోర్డులు మార్చి క్షణాల్లో అధికారులను బోల్తా కొట్టించారు. సినీ ఫక్కీలో అప్పటికప్పుడు అన్ని సర్దుబాటు చేశారు. తనిఖీల కోసం వచ్చిన అధికారులు వారి మాట వినేలా చేశారు. మీడియా ప్రతినిధులను తప్పుదోవ పట్టించారు. అధికారులు రాలేదంటూ అబద్ధాలు పలికారు.. శంకర్ దాదా ఎంబీబీఎస్ తరహాలో సాగిన ఈఘటన ఆదోనిలో చోటుచేసుకుంది. వివరాలు.. పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల రహదారిలో వెంకటేశ్వర జూనియర్ కళాశాల పక్కన ఆర్ఎస్ నర్సింగ్ స్కూల్‌ను మూడేళ్ల కిందట ఏర్పాటుచేశారు. ఓఇంటిని అద్దెకు తీసుకొని ఆర్ఎస్ నర్సింగ్ స్కూల్ అంటూ బోర్డు పెట్టేశారు. ఇంటర్ పూర్తయిన వారికి జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫెరీ (జీఎన్ఎం) మూడున్నరేళ్ల కోర్సుకు ప్రవేశాలు జరుపుకున్నారు. మూడేళ్లుగా ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకున్నా జీఎన్ఎం తరగతులు నిర్వహిస్తున్నారు. కర్నూలు కళాశాలకున్న అనుమతులతో సర్టిఫికెట్లను వారికి అందజేస్తున్నట్లు తెలుస్తుంది.

అప్పటికప్పుడు అన్ని మార్పు..

విశ్వనారాయణ జూనియర్ ఒకేషనల్ కళాశాల బోర్డు స్థానంలో ఆర్ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ స్టిక్కర్‌ను అప్పటికప్పుడే అతికించేశారు. అప్పటికప్పుడే గేటుకు ఓ బో ర్డును తగిలించారు. ఆజూనియర్ కళాశాలకు చెందిన బస్సును సైతం ముందు భాగంలో ఆర్ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ అంటూ స్టికర్ చేశారు. ఫ్యాకల్టీ ఎవరు లేకున్నా కర్నూలు నుంచి వారిని కార్లలో రప్పించి తెల్లకోటు (యాప్రాన్) ధరింప చేసి వీరే బోధించే ఫ్యాకల్టీ అని చూపించారు. ఆర్ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌కు ల్యాబ్‌లు లేకున్నా గంటపాటు కళాశాలకు చెందిన ల్యాబ్‌లు ఉన్నాయంటూ సెట్ చేశారు. మీడియా ప్రతినిధులకు అధికారులు తనిఖీలకు వస్తున్నారని తెలియ డంతో అక్కడికి వెళ్లారు.



అధికారుల తనిఖీకి ముందు నర్సింగ్ కళాశాల బోర్డు



తనిఖీ అనంతరం విశ్వనారాయణ కళాశాలగా మార్పు

మీడియా ప్రతినిధులను చూసి తనిఖీలకు వస్తున్న అధికారులను ఆర్ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ యాజమాన్యం అలా కారులోనే ఆదోని అంతా తిప్పారు. మీడియా ప్రతినిధులను తప్పుదోవ పట్టించేందుకు అధికారులు రావడం లేదంటూ కళాశాలలో ఉన్న విద్యార్థులను మరోచోటికి పంపారు. సిబ్బంది అంతా బయటికి వెళ్లారు. ఆర్ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ బోర్డును తిప్పేశారు. అక్కడినుంచి మీడియా ప్రతినిధులు వెళ్లిన వెంటనే అరగంటలోనే తనిఖీకొచ్చిన అధికారులను మరోమారు సెట్ చేసి లేనివి ఉన్నట్లు వారికి కళాశాల యాజమాన్యం చూపించారు. తనిఖీకొచ్చిన అధికా రులు ఆర్ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాల యాజమాన్యం చెప్పినట్లు నడుచుకోవడం పట్ల పలు అనుమానాలకు తావిస్తోంది. నర్సింగ్ విద్యార్థుల భవితవ్యాన్ని అంధకారంలోకి నెట్టేస్తున్నారు. కర్నూలులో ఉన్న కళాశాలలకు చెందిన గుర్తింపు సర్టిఫికెట్లను అందజేస్తున్నారు.

అనుమతుల కోసం..

ఆదోనిలో ఆర్ఎస్ నర్సింగ్ స్కూల్ ఉందని ఇటీవల అనుమతుల కోసం ప్రభుత్వా నికి దరఖాస్తు చేసుకున్నారు. వైద్యారోగ్య శాఖ విజయవాడ డీఎంఈ రిజిస్టర్ కార్యాలయం నుంచి తనిఖీల కోసం బుధవారం అధికారులు వచ్చారు. ముందుగానే ఆర్ఎస్ నర్సింగ్ స్కూల్ ఆఫ్ కళాశాల యాజమాన్యానికి సమాచారం ఇవ్వడంతో అప్పటికప్పుడే అదే ఏరియాలో వెనుక రోడ్డులో ఉన్న విశ్వనారాయణ ఒకేషనల్ జూనియర్ కళాశాలను అదే అంటూ చూపించే ప్రయత్నించారు. విశ్వ నారాయణ కళాశాల యాజమాన్యం విద్యార్థులకు సెలవు ప్రకటించి ఆర్ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌కు గంటపాటు అప్పచెప్పారు. అధికారులు వచ్చే లోపు అక్కడున్న వాతావరణం అంతా మార్చేశారు.

తనిఖీకి వస్తున్నారంటే..

ఆర్ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ యాజమాన్యం వాళ్లు అనుమతులు దరఖాస్తు చేసు కున్నామని, అధికారులు తనిఖీ కోసం వస్తున్నారంటూ బిల్డింగ్ కావాలని చెప్పడంతో సరే అన్నా. మా కళాశాలలో ల్యాబ్, ప్రిన్సిపాల్ గదిని, తరగతి గదులను తనిఖీ అధికారులకు చూపించారు. మా బోర్డు తీసేసి ఆర్ఎస్ స్కూల్ ఆఫ్ స్కూల్ స్టిక్కర్‌ను అతికించుకున్నారు. తనిఖీలు అయిన వెంటనే మాకళాశాల మాకు అప్పజెప్పారు. **- మల్లికార్జున, కరస్పాండెంట్, విశ్వనారాయణ కళాశాల, ఆదోని**

'మావాళ్లకే అవకాశమివ్వాలి'



ఎస్టేట్ అధికారిని నిలదీస్తున్న రైతులు, పొదుపు మహిళలు

- రైతుబజార్ అధికారులు, సిబ్బందిపై రాజకీయ నాయకుల ఒత్తిడి
- తామెక్కడికి పోవాలంటున్న రైతులు, పొదుపు మహిళలు

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు మే నెల 17వ తేదీన సి.క్యాంపు రైతుబజార్‌ను పర్యటించారు. ఆయన వెళ్లిపోయారో లేదో.. ఇక్కడ తిష్ట వేసేందుకు కొంతమంది నాయకులు, వారి అనుచరులు ఆరోజు నుంచి ఈరోజు వరకు చేయని ప్రయత్నాలంటూ లేవు. ఒక దశలో సి.క్యాంపు రైతుబజారు ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మ వారి ఒత్తిడి తట్టుకోలేక ఇక్కడ తాను పని చేయలేనని, వేరే రైతుబజారుకు బదిలీ చేయించుకుని వెళ్లిపోతానని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు.. సీ.క్యాంపు రైతు బజారులో తమ వారికే వ్యాపారాలు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలంటూ ప్రతి రోజూ తెలుగు తమ్ముళ్లు అధికారులు, సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఈ రైతుబజారుకు ప్రధాన రహదారి కోసం సీఎం పర్యటన సందర్భంగా కొంత మంది రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేసుకునే వారి అంగళ్లను తొలగించారు. ప్రస్తుతం అక్కడ వాహనాల రాకపోకలు మాత్రమే జరిగేలా కలెక్టర్, ఎస్పీలు చర్యలు తీసుకున్నారు. దాదాపు 60మంది దాకా ఆ ప్రధాన రహదారి వద్ద కూరగాయలు అమ్ముకుని జీవనం చేసేవారు. వీరికి తప్పనిసరిగా ఉపాధి కల్పిస్తామని సి.క్యాంపు రైతుబజారును విస్తరించిన తర్వాత అక్కడ వ్యాపారం చేసుకునేందుకు అవకాశం కల్పించడంతో పాటు కొత్తగా ఏర్పాటు కానున్న కల్లూరులోని గోవర్ధనగిరి రైతుబజారులో స్టాల్స్ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఇస్తామని వారికి రైతుబజార్ అధికారులు నచ్చజెబుతూ వస్తున్నారు. వీరంతా చోటా, మోటా నాయకులతో సీ.క్యాంపు రైతుబజారులోనే వ్యాపారం చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలంటూ ప్రతి రోజు నాయకులతో ఫోన్లు, సిఫారసు లెటర్లు తీసుకువస్తుండటంతో రైతుబజారు అధికారులు, సిబ్బందికి దిక్కుతోచడం లేదు. బయటివారు రైతుబజారులోకి ప్రవేశిస్తే కొన్నేళ్లుగా ఈ రైతుబజారునే నమ్ముకుని కూరగాయలు అమ్ముకుంటున్న తామెక్కడికి పోవాలని రైతులు, పొదుపులక్ష్మి గ్రూపుల మహిళలు బుధవారం సీ.క్యాంపు రైతుబజారు కార్యాలయంలో ఎస్టేట్ అధికారిని ప్రశ్నించారు. ఒక్కసారిగా రైతులంతా వచ్చి ప్రశ్నిస్తుండటంతో రైతుబజారు అధికారులకు, సిబ్బందికి దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. ఏం సమాధానం చెప్పుకోవాలో అర్థంగాక తలపట్టుకుని కూర్చున్నారు. కలెక్టర్, జేసీ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రైతులు, పొదుపుగ్రూపు మహిళలు మొర పెట్టుకుంటున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- కర్నూలు కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. గత ఏడాది 1,127 మంది రైతులకు రూ.2.42 కోట్ల సబ్సిడీతో వ్యవసాయ యంత్ర పరికరాలను పంపిణీ చేశారు. ఆ రైతులతో బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల ఉత్పాదకతను పెంచడంలో వ్యవసాయ యంత్రీకరణ కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో గత సంవత్సరం 314 గ్రామాల్లో 1,127 మంది చిన్న సన్నకారు రైతులకు రూ.2.24 కోట్ల సబ్సిడీతో వ్యవసాయ పరికరాలను అందించిందన్నారు. బ్యాటరీ స్ప్రేయర్లు, కల్టివేటర్లు, రోటవేటర్లు, పవర్ రీడర్స్, బండ్ ఫార్మర్స్ తదితర ముఖ్యమైన పరికరాలను అందించామన్నారు. వీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. జిల్లాలో 35 డ్రోన్లు ఏర్పాటు లక్ష్యం ఉందని, ఒకవేళ అంతకంటే ఎక్కువ మంది రైతులు ముందుకు వస్తే వారితో సంఘాలను ఏర్పాటు చేసి దరఖాస్తులను తీసుకోవాలని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మికి సూచించారు. రైతులకు పరికరాలను సరఫరా చేసినందుకు ఖర్చు చేసిన రూ.2,42,30,310 మెగా చెక్కును కలెక్టర్ అందజేశారు. అనంతరం దేవనకొండ మండలానికి చెందిన బిస్మిల్లా గ్రూపునకు డ్రోగో కంపెనీకి చెందిన డ్రోన్‌ను కలెక్టర్ అందించారు. ఈ డ్రోన్ ధర రూ.9.8 లక్షలు కాగా, 80 శాతం రాయితీపై అందజేశారు.

'అతిసార' నియంత్రణకు కృషి : డీఎంహెచ్‌వో

- స్టాప్ డయేరియా క్యాంప్ పోస్టర్ విడుదల



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డా.శాంతికళ

కర్నూలు హాస్పిటల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత పాటించి అతిసార వ్యాధిని నివారించాలని కర్నూలు డీఎంహెచ్‌వో డా.పి. శాంతికళ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డయేరియా నివారణ అవగాహన కార్యక్రమం స్టాప్ డయేరియా క్యాంప్ సందర్భంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జూన్ 16 నుంచి జూలై 31 వరకు డయేరియా నివారణపై అవగాహన కార్యక్రమాలు జిల్లా అంతటా ప్రతి నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఐవో డా. నాగప్రసాద్ బాబు, డీఎంహెచ్‌వో కార్యాలయ ఏవో కే. అరుణ, డెమో శ్రీనివాసుల శెట్టి, ఎస్‌వో హేమ సుందర్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు

- 30 వాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైకులను పరిశీలిస్తున్న ఎస్పీ

గోనెగండ్ల/కర్నూలు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గత ఏడాదిగా పోలీసులుకు కంటిమీద కునుకు లేకుండా చేసిన ద్విచక్ర వాహనాల దొంగను ఎట్టకేలకు గోనెగండ్ల పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. దొంగ దగ్గర నుంచి రూ. 35 లక్షల విలువ చేసే 30 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గోనెగండ్ల మండలం పెద్దమర్రివీడు గ్రామానికి చెందిన బజారి కుమారుడు వెంకటేశ్ కూలి పనులు చేసి జీవించేవాడు. విలాసాలు, మద్యానికి బానిసై సులువుగా డబ్బు సంపాదిం చాలనుకొని మొదట్లో చిన్న చిన్న దొంగతనాలకు అలవాటు పడ్డాడు. తర్వాత బస్టాండ్‌లో, ఇండ్ల ముందు, హోటళ్ల ముందు నిలిపిన ద్విచక్రవాహ నాలను దొంగతనం చేయడం మొదలు పెట్టాడు. కర్నూలు, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, దేవనకొండ, కోడుమూరు, ఓర్వకల్లు తదితర ప్రాంతాలలో ద్విచక్రవాహనాలను దొంగలించాడు. ఎస్పీ ఆదేశాలతో గోనెగండ్ల సీఐ విజయభాస్కర్ తన బృందంతో విచారణ చేపట్టారు. కొద్ది రోజులుగా పోలీసులు నిఘా పెట్టారు. దొంగ వెంకటేశ్ దొంగతనం చేసిన ద్విచక్రవాహనాలను స్వగ్రామంలోని తన పాడుబడిన ఇంట్లో దాచినట్లు పోలీసులు కనుకొన్నారు. దీంతో బుధవారం పథకం ప్రకారం మాటు వేసి పెద్దమర్రివీడు గ్రామ శివార్లలోని సుంకులమ్మ దేవాలయం దగ్గర వెంకటేశ్‌ను అరెస్టు చేసి, ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ విజయ భాస్కర్ తెలిపారు.

హ్యాండ్‌బాల్ విజేతలు అథేనా, మాంటిస్సోరి పాఠశాలలు

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఒలింపిక్ డే సంబరాల సందర్భంగా నిర్వహించిన అంతర్ పాఠశాలల హ్యాండ్‌బాల్ బాలుర విభాగంలో అథేనా పాఠశాల, బాలికల విభాగంలో మాంటిస్సోరి హై స్కూల్ జట్టు విన్నర్లుగా నిలిచాయి. అలాగే బాలికల విభాగంలో సెయింట్ జోసెఫ్ రెండో స్థానంలో నిలువగా.. బాలుర విభాగంలో గూళ్యం జడ్పీహెచ్ఎస్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు 22న కొండారెడ్డి బురుజు వద్ద ఒలింపిక్‌డే రన్ సందర్భంగా బహుమతులు అందజేస్తున్నట్లు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు తెలిపారు.

ఒలింపిక్ డే రన్‌ను విజయవంతం చేయండి



హాకీ ఆడుతున్న గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి.శంకర్‌శర్మ

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 22న నిర్వహించే ఒలింపిక్‌డే రన్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి.శంకర్‌శర్మ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో హాకీ, జూడో పోటీలు నిర్వహించారు. డా.శంకర్‌శర్మ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొని రాణించాలన్నారు. కార్యక్రమంలో రామాంజనేయులు, సుధీర్, చిన్న సుంకన్న, ప్రణీత్ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికుల సమస్యను పరిష్కరించాలి



మథర్ థెరిస్సా విగ్రహం వద్ద దుకాణాదారుల నుంచి భిక్షాటన చేస్తున్న కార్మికులు

కర్నూలు న్యూసిటీ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో పని చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మనోహర్ డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని గత 43 రోజులుగా సమ్మె చేస్తున్న పట్టించుకోకపోవడంతో బుధవారం నగర పాలక కార్యాలయ సమీపంలోని మథర్‌థెరిస్సా విగ్రహం నుంచి చిన్న పార్కు వరకు భిక్షాటన చేసిన విన్నూత్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి సమీర్‌బాషా, ఉపాధ్యక్షుడు నాగశేషులు, నగర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ,కార్యదర్శి యాసిన్‌బేగ్, జ్ఞానమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలను తొలగించండి

కర్నూలు న్యూసిటీ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలను తొలగించాలని పట్టణపౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి అన్నారు. బుధవారం కమిటీ సభ్యులు ఈశ్వర్‌నగర్, భాస్కర్‌నగర్ ప్రాంతాల్లో స్థానికులతో కలిసి పర్యటించారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ 30 ఏళ్ల కిందట వేసిన విద్యుత్ ఇనుప స్తంభాలు కొన్ని శిథిలావస్థకు చేరాయన్నారు. ఇళ్లకు 2 అడుగులు, నేలకు 8-10 అడుగుల దూరంలో విద్యుత్ వైర్లు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఎత్తైన కొత్త విద్యుత్ స్తంభాలు వేయాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు పి.వెంకటేశ్వర్లు, వేణుధరరెడ్డి, మహ్మద్ యూనుస్, సివి.వర్మ, అన్వర్‌బాషా, ఆర్.విజయరాజు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



ఈద్గా ఆవరణలో మొక్కలు నాటుతున్న సంక్షేమ శాఖ అధికారి సబియా పర్వీన్


కర్నూలు న్యూసిటీ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని పరిరక్షించుకునేలా మొక్కలను నాటాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సబియా పర్వీన్ అన్నారు. బుధవారం సంతోష్‌నగర్‌లోని సుల్తానియా ఈద్గాలో ఈద్గా ముత్తవల్లి ఎస్.నూర్ అహ్మద్ అధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ అధికారితో పాటు టీడీపీ సీనియర్ నాయకులు మొక్కలను నాటారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఎస్.వాహిద్‌భాష, హజ్ కమిటి సభ్యులు మన్సూర్ అలీఖాన్, మన్సూర్ మౌలానా సాహెబ్, జేఏసీ కమిటి సభ్యులు ఎం.ఏ.హమీద్, తదితరులు పాల్గొన్నారు.

జంగం కులంలో బెగ్గింగ్ పదం తొలగించాలి

కర్నూలు అర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): దాసరి కులంలో బెగ్గింగ్ అనే పదాన్ని తొలగించారని, జంగం కులంలో కూడా బెగ్గింగ్ అనే పదం తొలగించాలని బేడ, బుడగ, జంగమ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తుర్పాటి మనోహర్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలో ఆయన మాట్లాడుతూ బేడ బుడగ, జంగం ఎస్సీ, జంగం బెగ్గింగ్, బీసీ కులాలలను వేర్వేరు అయినా ప్రభుత్వ అధికారులు గందరగోళంలో పడి బేడ, బుడగ, జంగమ కులానికి రిజర్వేషన్ హక్కులు అందుకోవడానికి ఇబ్బందిగా ఉందని వాపోయారు. తక్షణమే ప్రభుత్వం ఆన్‌లైన్‌లో బేడ, బుడగ, జంగం కులాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

నగరపాలికలో కంప్యూటర్ సమస్య

- జనన, మరణ దరఖాస్తుల స్వీకరణ కేంద్రంలో పని చేయని సీపీయూ
- ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులు



కేంద్రంలో పని చేయని సీపీయూ

కర్నూలు న్యూసిటీ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): నగర పాలిక కార్యాలయంలోని జనన,మరణ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తుల స్వీకరణ కేంద్రంలో కంప్యూటర్ సమస్య వేధిస్తోంది. ప్రధానంగా కంప్యూటర్‌కు సంబంధించి ప్రధాన భాగమైన సీపీయూ(సెంట్రల్ ప్రాసెసింగ్ యూనిట్) 15 రోజులుగా పని చేయడం లేదు. దీంతో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులు తీసుకున్న తరువాత ఒక రసీదు కంప్యూటర్ ప్రింటర్ నుంచి తీసి ఇస్తున్నారు. అయితే సమస్య ఉండడంతో సిబ్బంది మ్యానువల్‌గా ఇస్తున్నారు. ఈ క్రమంలో ఐదు నిమిషాల్లో ఇవ్వాల్సిన రసీదు కనీసం 10 నిమిషాలు పడుతుంది. ఈ క్రమంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మాత్రమే కేంద్రం పని చేస్తుంది.

● రోజుకి 100కు పైగా దరఖాస్తుల స్వీకరణ...

జనన,మరణ ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ కేంద్రానికి ప్రతి రోజు 90 నుంచి 100 వరకు దరఖాస్తులు వస్తుంటాయి. సీపీయూ, కంప్యూటర్, ప్రింటర్ పని చేయకపోతే రసీదు ఇవ్వడం కోసం సమయం తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సుమారు 15 రోజుల నుంచి ఈ సమస్య ఉందంటే అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. పాఠశాలలు, కాలేజీలు ప్రారంభం కావడంతో విద్యార్థులు జనన ధ్రువీకరణ పత్రాలు అవసరం. అధికారులు స్పందించి మరమ్మతులు చేసి సీపీయూను బాగు చేయించాలని తల్లితండ్రులు కోరుతున్నారు.

ఇతర ప్రాంతాల నుంచే ఎక్కువ మంది..

ముఖ్యంగా నగర పాలక కార్యాలయంలోని జనన,మరణ ధ్రువీకరణ పత్రాల కోసం ఇతర ప్రాంతాల నుంచే ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు. కేవలం ప్రైవేటు ఆసుపత్రులలో జన్మించి, నగర పాలక సంస్థ



మ్యానువల్‌గా రసీదును రాసి ఇస్తున్న సిబ్బంది



కౌంటర్ బయట రసీదు కోసం నిల్చున్న ప్రజలు

పరిధిలో జన్మించకపోతేనే ఇక్కడ జనన ధ్రువీకరణ పత్రాలు ఇస్తారు. ప్రభుత్వ ఆసుపత్రిలో జన్మిస్తే అక్కడే జనన ధ్రువీకరణ పత్రాలు ఇస్తారు. అదే విధంగా నగర పాలిక పరిధిలో ఉంటూ ప్రైవేటు ఆసుపత్రిలో డెలివరీ అయితే సంబంధిత సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

● త్వరలోనే కొత్త సీపీయూ ఏర్పాటు చేస్తాం

కేంద్రంలో త్వరలోనే కొత్త సీపీయూ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. సమస్య అధికారుల దృష్టికి వచ్చింది. కొత్త సీపీఐ కోసం ఇండెంట్ పెట్టాం. వచ్చిన వెంటనే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. కేంద్రంలో కంప్యూటర్, సీపీయూ, ప్రింటర్ మరమ్మతులు గురికాకుండా సిబ్బందిని అప్రమత్తం చేస్తాం.

- చిన్నరాముడు, మేనేజర్, నగర పాలక సంస్థ, కర్నూలు

తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పాణ్యం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంస్థాగత కమిటీల నియామక సమావేశం నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డితో కలిసి నిర్వహించారు. రాష్ట్ర ఎలక్షన్ అబ్జర్వర్ ఆకెపోగు ప్రభాకర్, పాణ్యం నియోజక అబ్జర్వర్ ఆదెన్న హాజరయ్యారు. గౌరుచరిత మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. క్రియాశీలకంగా పని చేసే కార్యకర్తలకు పదవులు వాటంతట అవే వస్తాయని, ఎవరు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. త్వరల్లో గ్రామ, మండల, వార్డు కమిటీలు జూన్ నెలాఖరు లోపు పూర్తి చేస్తామని, అధిష్టానం మండల అబ్జర్వర్‌లను ఏర్పాటు చేసిందన్నారు. టీడీపీ అభివృద్ధి కోసం పనిచేసే కార్యకర్తలందరికీ పదవులు అందెలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల అబ్జర్వర్‌లు కొండారెడ్డి, టిప్పుసుల్తాన్, మనోహర్‌రెడ్డి, ఖలీల్ అహమ్మద్, 16 వార్డు టీడీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులను పరామర్శించిన గౌరు

ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలో విద్యుత్‌షాక్‌కు గురైన టీడీపీ కార్యకర్త కటిక బడేసా, షేక్షావలిని నందికొట్కూరు టీడీపీ ఇన్‌చారి గౌరు వెంకటరెడ్డి పరామర్శించారు. బుధవారం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులకు ధైర్యం చెప్పి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. పార్టీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు గౌరు వెంకటరెడ్డి భరోసా ఇచ్చారు.

ఆధ్యాత్మికతపై అవగాహన అవసరం

కర్నూలు అర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): యువత మేధో సంబంధిత విషయాలతో పాటు భావోద్వేగాల నియంత్రణ, ఆధ్యాత్మికతకు సంబంధించిన విషయాలపై అవగాహన కలిగి ఉండాలని ఉపకులపతి వి. వెంకట బసవరావు అన్నారు. బుధవారం రాయలసీమ యూనివర్సిటీలోని సెంట్రల్ లైబ్రరీ వద్ద ఉదయం నాలుగు రోజుల వర్క్ షాపులో భాగంగా రెండో రోజు కార్యక్రమంలో ఉపకులపతి, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ సమగ్ర వ్యక్తిత్వ నిర్మాణానికి యోగా ఎంతగానో సహకరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి. విజయకుమార్, సుందరానంద పుచ్చా, సి. విశ్వనాథరెడ్డి, వర్క్ షాప్ కోఆర్డినేటర్ కవిత, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయ సూత్రాలు పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని అవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి

కర్నూలు అర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వృక్ష శాస్త్ర ఆధ్యాపకుడు డాక్టర్ దండుగుల మధు సుధాకర్ రచించిన సేంద్రియ వ్యవసాయ సూత్రాలు అనే పుస్తకాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి అవిష్కరించారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుత సమాజానికి అవసరమైన అంశంపై సమగ్ర సమాచారంతో ఇటువంటి పుస్తకాన్ని రచించడం ఎంతో అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హేమంత్, సత్యనారాయణ, సాజిదాబీ, వింద్యావానీసీ దేవీ, మార్కెండేయచారి పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

కర్నూలు అర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు మండలం కొల్లంపల్లి తాండా శివారులో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన1000 లీటర్ల బెల్లం ఊట, 30లీటర్ల సారాను ధ్వంసం చేశామని ఎక్సైజ్ సీఐ చంద్రహస్ తెలిపారు. బుధవారం నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సారా తయారీ స్థావరాలే లక్ష్యంగా దాడులు నిర్వహించారు. అంతకు ముందు గ్రామంలో ప్రజలకు సారాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాటు సారా అమ్మడం, తయారు చేయడం చట్టరీత్యా నేరమని, నాటుసారా పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది చంద్రపాల్, రాజు, రామలింగయ్య, మధు, ఈరన్న పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీలు, మంత్రి



నారా లోకేశ్‌తో పాటు కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీలు

కర్నూలు అర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌తో పాటు ఉమ్మడి జిల్లా ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి కలిశారు. బుధవారం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, సహచర ఎంపీలతో కలిసి సమావేశమయ్యారు. విద్యావ్యవస్థలో చేపట్టిన సంస్కరణలు, మార్పులపై చర్చించారు. జూలై 5న ఏపీలో నిర్వహించే మెగా పేరెంట్స్ టీచర్ సమావేశానికి హాజరు కావాలని ఆహ్వానించారు. అనంతరం ఆగస్టులో విద్యా శాఖ మంత్రుల కాంక్లేవ్ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్‌కు అవకాశం కలిపించిన మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు.

నీట్ ర్యాంకర్‌కు సన్మానం



మహ్మద్ సోహేల్‌కు అభినందిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు హాస్పిటల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నీట్‌లో జాతీయ స్థాయిలో 133వ ర్యాంకు సాధించిన మహ్మద్ సోహేల్‌ను కలెక్టర్ పి.రంజిత్ బాషా బుధవారం కలెక్టర్ చాంబరులో సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థి మహ్మద్ సోహేల్ ఇంకా ఎన్నో ఉన్నత చదువులు చదివి వైద్యవిద్యలో మంచి డాక్టర్‌గా పేరొందాలని ఆకాంక్షించారు. విద్యార్థి సోహేల్ మాట్లాడుతూ తన తండ్రి కమల్ సాహేబ్ కోడుమూరు కో-లోకేటెడ్ పీహెచ్‌సీలో హెల్త్ సూపర్‌వైజర్‌గా, తల్లి జడ్పీహైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నసీమున్నీసా, ఉపాధ్యాయులు, అధ్యాపకులు ప్రోత్సాహంతో ఈ ర్యాంకు సాధించినట్లు తెలిపారు.

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న తహసీల్దార్ కె.ఆంజనేయులు

కల్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో జి.నాగశేషాచలరెడ్డి ఆధ్వర్యంలో మొక్కుబడిగా నిర్వహించి మమ అనిపించారు. బుధవారం కల్లూరు ఎంపీపీ బి.శారద అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అధికారులు ప్రగతి నివేదికలు చదవడం మినహా సమస్యలు ప్రస్తావనకు రాలేదు. సమావేశానికి హాజరైన అధికారులు ఎవరికి వారు మాట్లాడుకుంటూ ఉండటంతో ఒక మండల అధికారి చదివే ప్రగతి నివేదిక అర్థంకాక ప్రజాప్రతినిధులు బిక్కమొహం వేశారు. ఎవరు ప్రశ్నించక పోవడంతో ఆ అధికారి తన కుర్చీలో కూర్చున్నారు. కొందరు ఎంపీటీసీలు ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం డబ్బులు పడలేదని, అన్నదాత సుఖీభవ పథకంలో రైతులకు ఈకేవైసీ చేయడం లేదని సభకు వివరించారు.

రీ కౌన్సెలింగ్ నిర్వహించాలి

కర్నూలు హాస్పిటల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ హంస అసోసియేషన్ ఆఫీస్ బేరర్లకు ప్రభు త్వం బదిలీలకు రీకౌన్సెలింగ్ నిర్వహించాలని హంస సిటీ అధ్యక్షుడు టీ.గోవిందు కోరారు. కర్నూలు జీజీహెచ్‌లోని యూనియన్ ఆఫీసులో బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏపీ హంస గుర్తింపును తాత్కాలికంగా నిలుపుదల చేసిందని, అయితే దీన్ని సవాల్ చేస్తూ రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్ హైకోర్టును ఆశ్రయించగా.. బుధవారం ఏపీ హంస గుర్తింపును యథావిధిగా కొనసాగించాలని ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు.. ఈ మేరకు కమిషనర్ కూడా టెలికాన్ఫరెన్స్ ద్వారా కడప రీజనల్ డైరెక్టర్‌కు హైకోర్టు ఆదేశాలు తెలియజేశారనీ, కావున సీఎఫ్‌డబ్ల్యూ ఆదేశాల మేరకు ఆర్‌డీ బుధవారం జరిగిన జోనల్ క్యాడల్ పరిధిలోనే స్టాఫ్ నర్సులతో సహా పది క్యాడర్లకు సంబంధించిన బదిలీల కౌన్సెలింగ్ నిలుపుదల చేయడం జరిగిందన్నారు. 11క్యాడర్లకు సంబంధించిన హంస యూనియన్ ఆఫీస్ బేరర్ల పరిగణనలోకి తీసుకుని గురువారం కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఆర్‌డీ జూమ్‌లో తెలిపినట్లు పేర్కొన్నారు.

త్వరలో 15వ ఆర్థిక సంఘ నిధులు

● సర్పంచుల ఖాతాలో జమ



పీఆర్ కమిషనర్ కృష్ణతేజకు వినతి పత్రం అందజేస్తున్న బిర్రు ప్రతాప్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): త్వరలోనే 15వ ఆర్థిక సంఘం నిధులు సర్పంచుల ఖాతాలో జమ అవుతాయని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం విజయవాడలోని పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజను కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. త్వరలోనే సర్పంచుల ఖాతాలో జమ చేసే విధంగా కమిషనర్ హామీ ఇచ్చారన్నారు. అదే విధంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేసిన పనులకు కూడ త్వరలోనే బిల్లులు చెల్లిస్తామని కమిషనర్ తెలిపినట్లు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు.

'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'ను విజయవంతం చేద్దాం

గూడూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని కమిషనర్ రమేష్ బాబు అన్నారు. బుధవారం గూడూరులోని నగర పంచాయతీ కార్యాలయంలో 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'పై కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'లో భాగంగా ప్రతి నెల మూడో శనివారం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వర్షాలు కురుస్తుండడంతో దోమలు వృద్ధి చెందుతాయని, అధికారులు బ్లీచింగ్‌పౌడర్ చల్లాలని సూచించారు.

సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సి. బెళగల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటలకు ప్రభుత్వం అందించే సబ్సిడీలను సన్నకారులు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోడుమూరు ఉద్యానవనశాఖ అధికారి మధుసూదన్‌గౌడు అన్నారు. బుధవారం మండలంలోని బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, పోలకల్లు గ్రామాలలో రైతులు పెంచుతున్న పండ్లతోటలను పరిశీలించారు. ఆయన రైతులతో మాట్లాడుతూ పండ్ల మొక్కల కాండం బాగాన నీరు నిలువకుండ ఉండేలా చూడాలన్నారు. తేమ శాతం ఎక్కువగా ఉంటే పండ్లమొక్కలు తేమశాతానికి కుళ్లిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా డ్రిప్ అందజేస్తుందన్నారు. ఈఅవకాశాన్ని 5 ఎకారలు లోపు ఉన్న సన్నకారు రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆయన వెంట ఆయాగ్రామాల అగ్రికల్చర్ అసిస్టెంట్లు, చెంచురాజు, నగన్న, రాజశేఖర్, బాస్కర్, రైతులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సి. బెళగల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి మదన్‌కుమార్‌రెడ్డి ఏఎన్ఎంలకు ఆదేశించారు. బుధవారం మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని ప్రజలను ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించకుండా ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు జాగ్రత్త వహించాలన్నారు. గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. ఈ సమావేశంలో హెల్త్ సూపర్‌వేజర్లు, ఏఎన్ఎంలు ఆశావర్కర్లు ఉన్నారు.

'ఆదోని ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి'

కర్నూలు న్యూసిటీ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): దళిత సర్పంచ్‌ను అవమానించిన ఆదోని ఎమ్మెల్యే పార్థసారథిపై కేసు నమోదు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ డిమాండ్ చేశారు. ఆదోని మండల పరిధిలోని దానాపురం గ్రామంలో దళిత సర్పంచ్‌ని ఎస్సీ అని వేదికపైకి ఎక్కకుండా అవమానించడం దారుణమన్నారు. వెంటనే పోలీసులు సుమోటోగా తీసుకుని ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

● కుల అహంకారాన్ని తట్టి లేపుతూ కూటమి ప్రభుత్వం విజయోత్సవ సభలు చేయడం సరికాదని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. అంజిబాబు అన్నారు. ఆదోని మండలంలో దానాపురం సర్పంచును అవమానించిన ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకురాలు గుడిసె కిష్టమ్మపై ఎస్సీఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దళితుడైన సర్పంచ్ చంద్రశేఖర్‌ను వేదిక దగ్గరికి వచ్చినా పైకి పిలవకుండా కిందే నిలబెట్టి మాట్లాడారన్నారు.

19న వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఒలింపిక్ డే సంబరాలు జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు 19న వెయిట్ లిఫ్టింగ్ హాలులో జరుగుతున్నాయనీ సెక్రటరీ పాపా బుధవారం తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ నెల 19న ఉదయం 8 గంటలకు వెయిట్ లిఫ్టింగ్ హాలులో హాజరు కావాలని తెలిపారు. బాలురకు ఉదయం 11 గంటలకు, బాలికలకు ఉదయం 9 గంటలకు జరుగుతాయన్నారు. వివరాల కోసం9849249357ను సంప్రదించాలన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రభుత్వ డ్రైవర్ల ఉద్యోగుల సంఘం నాయకులు



కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంఘం నాయకులు

కర్నూలు కలెక్టరేట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ చాంబరులో బుధవారం కర్నూలు జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల ఉద్యోగుల సంఘం నూతన అడ్‌హక్ కమిటీ ఐదు మంది మెంబర్లు అబ్దుల్ హమీద్, ఇలియాస్ బాషా, విజయకుమార్, సోమునాయక్, షబ్బీర్ బాషా కలెక్టర్ రంజిత్ బాషాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు.

దినచర్యలో క్రీడలు అంతర్భాగం కావాలి

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు క్రీడలు అంతర్భాగం కావాలని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శమంతకమణి అన్నారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన వాలీబాల్, హ్యాండ్‌బాల్, యోగా పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ పోటీలను మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శమంతకమణి, రాష్ట్ర యోగా చైర్మన్ లక్ష్మీకాంతరెడ్డి, ఒలింపిక్ సంఘం సీఈవో పి.విజయకుమార్, వాలీబాల్ సంఘం కార్యదర్శి షరీఫ్ అహ్మద్ పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నిర్వహణ కార్యదర్శి పి.సునీల్ కుమార్, హ్యాండ్‌బాల్ జిల్లా కార్యదర్శి రుద్రరెడ్డి, యోగా కార్యదర్శి అవినాష్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాలను పరిశీలిస్తున్న అతిథులు

బియ్యం మాయంపై సీబీసీఐడీతో విచారణ చేయించాలి



● మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్

ఆదోని, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం మాయంపై సీబీసీఐడీతో విచారణ చేయించాలని మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్ డిమాండ్ చేశారు. బుధవారం మాట్లాడుతూ రెవెన్యూ, పోలీసుశాఖ, సివిల్ సప్లై డైరెక్టర్ సీజ్‌చేసిన 2 వేల బియ్యం బస్తాలు సీజ్ చేయగా రాత్రికి రాత్రే బియ్యం మాయం కావడంపై నిందితులను శిక్షించాలని కోరారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడ ఓడరేవులో స్వాధీనం చేసుకున్న బియ్యం ముఠాలు తరలించినవేనని స్పష్టం చేశారు. ఆదోనిలో ఎప్పుడు ఇలా జరగలేదని, ముఠాను అధికార యంత్రాంగం ఈ వదిలిపెడితే మరింత రెచ్చిపోయే ప్రమాదముందన్నారు. ఈ విషయమై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు లేఖలు రాస్తానని ఆయన స్పష్టం చేశారు.

రైతులందరికీ సబ్సిడీ విత్తనాలు



విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ విజయుడు

మద్దికెర, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రైతులందరికీ సబ్సిడీ వేరుశనగ విత్తనాలు ఇస్తామని అందేలా సర్పంచ్ బురుజుల విజయుడు, టీడీపీ నాయకులు ఆనంద్ కుమార్, రమేష్ అన్నారు. బుధవారం ఎం.అగ్రహారం గ్రామంలో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. రైతులు సమీపంలోని రైతుభరోసా కేంద్రాలకు వెళ్లి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కార్యదర్శి విజయ్, రైతులు ఉన్నారు.

రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మద్దికెర, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మనపల్లి, కొత్తపల్లి రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతామని పంచాయతీ రాజ్ ఏఈ విష్ణు అన్నారు. బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'రహరాళ్లు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఎమ్మెల్యే శ్యాంబాబు సూచనల మేరకు నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు.

'అన్నదాత సుఖీభవ'కు ఈకేవైసీ అవసరం లేదు

మద్దికెర/తుగ్గలి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి ఈకేవైసీ అవసరం లేదని మద్దికెర ఏవో రవి, తుగ్గలి ఏవో సురేష్‌బాబు తెలిపారు. గురువారం మాట్లాడుతూ రైతులు ఇదివరకే ఈకేవైసీ నమోదు చేసుకుంటే సరిపోతుందని, అన్నదాత సుఖీభవ పథకానికి ప్రత్యేకంగా చేయించుకోవల్సిన అవసరం లేదన్నారు. మండలంలో 7వేల మంది రైతులు ఉండగా, 6,800 మంది ఈకేవైసీ చేయించుకున్నారని మరో 160 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు సిబ్బంది ఆనంద్, కవిత ఉన్నారు.

యోగాలో శిక్షణ ఇవ్వాలి

తుగ్గలి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు యోగాలో శిక్షణ ఇవ్వాలని ఎంపీడీవో విశ్వమోహన్ సూచించారు. బుధవారం కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా డే ఉత్సవాలు ప్రతి గ్రామంలో నిర్వహించాలన్నారు. అమృత్ సరోవర్ కింద మొక్కలు నాటాల న్నారు. రైతులకు పండ్ల తోటల పెంచితే రైతులు అభివృద్ధి చెందుతారని, అవగాహన కల్పించాలన్నారు. ఏపీవో హేమసుందర్, ఈసి రాజశేకర్, టీఏలు ప్రదీప్, రామకృష్ణ, చంద్ర, జయరాముడు, సీనియర్ మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో విశ్వమోహన్

'తల్లికి వందనం' వర్తింపజేయాలి



వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

వెల్దుర్తి టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లకు 'తల్లికి వందనం' వర్తింపజేయాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లలితమ్మ, జిల్లా అధ్యక్షురాలు చాందిని, నియోజకవర్గ అధ్యక్షురాలు సుజాత, సంధ్య డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి, సీనియర్ అసిస్టెంట్ అస్లాంకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. 40 రోజులు సమ్మె చేస్తే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు ఇప్పటివరకు నెరవేర్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాధవస్వామి, అంగన్‌వాడీలు విజయలక్ష్మి, రేణుక, ఏదమ్మ, వరలక్ష్మి, లక్ష్మి, కిషోర్, షాహీదా, రజని, గంగ, సుమలత, షమీనా, శిరీష పాల్గొన్నారు.

రూ.50 లక్షలతో మెప్మా ఆర్పీ పరారీ

ఆదోని, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మెప్మా రిసోర్స్‌పర్సన్ పొదుపు మహిళల సొమ్ముతో ఉడాయించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల మేరకు.. మెప్మా విభాగంలో రిసోర్స్‌పర్సన్‌గా పనిచేస్తున్న సోనీ తమ నుంచి రూ.50 లక్షలు వసూలు చేసి పరారయ్యిందని ఎమ్మెల్యే పార్థసారథికి పొదుపు మహిళలు ఫిర్యాదు చేశారు. డబ్బును పొదుచేస్తే బ్యాంకు రుణం వస్తుందని ఆశపడి ఆర్పీకి ఇచ్చామని, అయితే మూడు రోజులుగా కనిపించడం లేదన్నారు. స్పందించిన ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ కృష్ణకు ఫోన్‌చేసి చర్యలు తీసుకోవాలని, పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసాయలని మహిళలకు సూచించారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా విజయ్‌కుమార్

ఆలూరు, జూన్18(ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జి తహసీల్దార్‌గా విజయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన గోవింద్‌సింగ్ కర్నూలు కలెక్టరేట్‌కు బదిలీకావడంతో డీటీగా ఉన్న విజయ్‌కుమార్‌కు ఇన్‌చార్జి తహసీల్దార్ బాధ్యతలు అప్పగించారు.

పాలిటెక్నిక్ భవనానికి అనుమతి రాలేదు

ఆలూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ నూతన భవనం ప్రారంభోత్సవానికి అనుమతి రాలేదని ప్రిన్సిపాల్ డా.చిన్నపురెడ్డి బుధవారం తెలిపారు. స్థలం ఇచ్చిన దాతల పేర్లు పెట్టకపోవడంతో ప్రారంభం నిలిచిపోయిందన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని సూచించారు.

తహసీల్దార్ కార్యాలయం... సేవలు అస్తవ్యస్తం



తహసీల్దార్ కార్యాలయం వద్ద గుమికూడిన ప్రజలు

- ధ్రువపత్రాల జారీలో అధికారుల మీనమేషాలు, దరఖాస్తుల తిరస్కరణాలు
- దేవనకొండలో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు
- ఇప్పటికే విద్యాసంస్థల్లో ప్రారంభమైన అడ్మిషన్లు, కౌన్సెలింగ్

దేవనకొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయ అధికారులు ధ్రువపత్రాల జారీలో ఆలస్యం చేస్తుండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలు, ప్రొఫెషనల్ కోర్సుల్లో కౌన్సెలింగ్ మొదలవడంతో వారికి అవస్థలు తప్పడం లేదు.

దరఖాస్తుల తిరస్కరణ..

సచివాలయం, మీసేవా కేంద్రాల్లో ధ్రువపత్రాల కోసం విద్యార్థులు దరఖాస్తు చేస్తున్నారు. అయితే అధికారులు వివిధ కారణాలతో వాటిని తిరస్కరిస్తున్నట్లు విద్యార్థులు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

గతంలో రెండు, మూడు రోజుల్లోనే ధ్రువపత్రాలు జారీ అయ్యేవని ఇప్పుడు అధికారుల తీరు ఇలా అయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోసారి దరఖాస్తు చేసేందుకు సమయం లేదని, పైగా అదనపు రుసుము చెల్లించాల్సి వస్తుందని వాపోతున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి త్వరగా ధ్రువపత్రాలు జారీ అయ్యేలా చూడాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

కార్యాలయం చుట్టూ ప్రజల ప్రదక్షిణలు

కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కళాశాలలు, పాఠశాలలు, హాస్టళ్లు ఇప్పటికే ప్రారంభంకావడంతో అడ్మిషన్ పొందాలంటే ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. అవి లేకుంటే ప్రవేశం లభించదు. దీంతో అవస్థలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తును తిరస్కరించారు



నా కుతురిని హాస్టల్‌లో చేర్పించేందుకు కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల కోసం మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేశాను. దరఖాస్తును తిరస్కరించినట్లు సెల్‌కు మేసేజ్ వచ్చింది. దీంతో మళ్లీ దరఖాస్తు చేయాలి. మూడు రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించడం లేదు. **నరసన్న, వరిముక్కల గ్రామం**

దరఖాస్తులు ఎక్కువగా వస్తున్నాయి



ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఎక్కువగా వస్తున్నాయి. రోజుకి రెండు వందలకు పైగా కుల, ఆదాయ ధ్రువపత్రాల దరఖాస్తులు రావడంతో ఆలస్యమైంది. గడువులోగా పూర్తి చేస్తాం.
- రామాంజనేయులు, తహసీల్దార్, దేవనకొండ

సీపీఐ నాయకుల త్యాగాలు మరువలేనివి

ఆదోని రూరల్, జూన్ 18 ఆంధ్రజ్యోతి): సీపీఐ నాయకుల త్యాగాలు మరువలేనివని ఆ పార్టీ నాయకులు కల్లుబావి రాజు, ఈరన్న, భీమన్న తెలిపారు. వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భం బుధవారం బసాపురంలో సీపీఐ గార్యాలీ నిర్వహించి జెండా ఆవిష్కరించారు

యోగా చేయండి

చిప్పగిరి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ యోగా చేయాలని తహసీల్దార్ ఇజాజ్ అహ్మద్ సూచించారు. యోగాంధ్రలో భాగంగా బుధవారం రెవెన్యూ కార్యాలయం వద్ద కస్తూర్బా పీఈటీ యోగ శిక్షణ ఇచ్చారు. ఆర్ఐ సునీత, వీఆర్వోలు మల్లికార్జున, అంజి, వన్నూరు స్వామి, పెద్దన్న, గోవింద్ పాల్గొన్నారు.

సారా స్వాధీనం

ఆదోని రూరల్, జూన్ 18 ఆంధ్రజ్యోతి) : పట్టణ శివార్లలోని ఇస్వి కొండల్లో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్.ఐ నాయక్ తెలిపారు. వివరాల మేరకు.. బుధవారం కొండల్లో సారా తరలిస్తుండగా వాల్మీకి నగర్‌కు చెందిన బోయ రామాంజనేయులును అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

తప్పుడు ప్రచారంతో వైసీపీ విషం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

● ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకంపై వైసీపీ తప్పుడు ప్రచారంతో విషం కక్కుతోందని ఎమ్మెల్యే శ్యాంబాబు అన్నారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పరిశీలకుడు ఆదినారాయణతో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఇచ్చినమాట నిలుపుకున్న సీఎం చంద్రబాబుకు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లులు కృతజ్ఞతలు తెలుపుతున్నారని ప్రజల్లో ప్రభుత్వానికి ఆదరణ పెరగడాన్ని చూసి ఓర్వలేని వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. రూ.15వేలు ఇస్తామని రూ.13వేలు మాత్రమా ఇచ్చారని మిగిలిన రూ.2వేలు ఏమయ్యాయని ప్రచారం చేస్తున్న వైసీపీ నాయకులకు తమ పాలనలో రూ.2వేలు జగన్ జేబులోకి పోయాయా లేక తాడేపల్లి ప్యాలెస్‌కు చేరాయా అన్నది చెప్పాలన్నారు. 2019 ఎన్నికల్లో వైఎస్ భారతి ప్రతిఇంటిలో ఇద్దరు పిల్లలకు విద్యాదీవెన ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఒక్క విద్యార్థికే అమలు చేయడం ఎంటి అని ప్రశ్నించారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని ప్రగల్భాలు పలికి 12 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల జీవితాలు నాశనం చేసింది వైసీపీ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. సభ్యులు జీవాలు నాయక్, వెంకటేశ్వర్లు యాదవ్, మనోహర్‌చౌదరి, వెంకటపతి, తిరుపాల్‌నాయుడు, నరసింహదరి పాల్గొన్నారు.

అందరి అమోదంతోనే మిటీలు

నాయకులు, కార్యకర్తల ఆమోదంతోనే నూతన కమిటీలు ఏర్పాటుచేస్తామని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పరిశీలకులతో సమావేశం నిర్వహించారు. పరిశీలకుడు తలారి ఆదినారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్యాంబాబు ఆధ్వర్యంలో మండలాల నాయకులు, కార్యకర్త అభీష్టం మేరకు కమిటీ సభ్యులను నియమిస్తామన్నారు. సభ్యులు జీవాలునాయక్, వెంకటేశ్వరయాదవ్, రమాకాంత రెడ్డి, కురుబ రామక్రిష్ణ, రామేశ్వరరెడ్డి, సన్నగ వెంకట్ శివరాజ్, రామక్రిష్ణుడు తదితరులు ఉన్నారు.

అబద్ధపు హామీలపై పోరాటం

● మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ఆదోని అగ్రికల్చర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు అబద్ధపు హామీలపై పోరాటం ప్రజలతో కలిసి వైసీపీ పోరాటం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తన నివాసంలో పార్టీ పట్టణ కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా దేవ, ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్, ఉప్పర నారాయణ, కార్యదర్శి తాయన్న, గంగాధర్, గాజుల నాగరాజు, ఎల్లప్పతో పాటు మరో 24 మందిని ఎన్నుకున్నారు. టీడీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ప్రజలను మోసం చేసిందన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, చంద్రకాంత్ రెడ్డి, నల్లారెడ్డి, గుర్నాథ్ రెడ్డి, ఇబ్రహీం, ఈరన్న, రమేష్, తిమ్మప్ప పాల్గొన్నారు.

వీఆర్వో సార్ ఎక్కడ?

● పది రోజులుగా అందుబాటులో లేరని తెర్నేకల్ గ్రామస్థుల ఆవేదన



సచివాలయం వద్ద వేచి ఉన్న తెర్నేకల్ గ్రామస్థులు

దేవనకొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తమ వీఆర్వో షఫీ ఎక్కడ ఉన్నాడో చెప్పాలని మండలంలోని తెర్నేకల్ గ్రామస్థులు కోరుతున్నారు. వీఆర్వో పది రోజులుగా అందుబాటులో లేరని సచివాయం వద్ద ఉండటం లేదంటున్నారు. దీంతో సీపీఎం నాయకులు శ్రీనివాసులు, రవీంద్ర సచివాలయం-1 వద్ద గ్రామస్థులతో కలిసి ఆందోళన చేశారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం సచివాలయం చుట్టూ తిరుగుతున్నామని, తహసీల్దార్ రామాంజనేయులు దృష్టికి సమస్యను ఫోన్‌లో తెలియజేశారు. స్పందించిన తహసీల్దార్ రేపటి నుంచి అందుబాటులో ఉండేలా చూస్తానని సెలవిచ్చారు.

21 నుంచి పాలిటెక్నిక్ కౌన్సెలింగ్



ప్రిన్సిపాల్ చిన్నపురెడ్డి

ఆలూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు ఈనెల 21వ తేదీ నుంచి 28వ తేదీ వరకు కౌన్సెలింగ్ ప్రారంభం కానుందని ఆలూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ చిన్నపురెడ్డి బుధవారం తెలిపారు. పాలిసెట్-2025లో అర్హత సాధించిన వారు జిల్లాలో ఎక్కడైనా కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చన్నారు. ఆదోని పాలిటెక్నిక్‌లో కూడా కౌన్సెలింగ్ ఉంటుందని, అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలన్నారు. ఓసీ, బీసీ కేటగిరికి రూ.700, ఎస్సీ, ఎస్టీ కేటగిరి వారు రూ.250 చెల్లించాలన్నారు. ప్రాసెసింగ్ ఫీజు రసీదు, పాలిసెట్ హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, పదో తరగతి మార్కుల జాబితా, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, నాలుగు నుంచి పదో తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

కేసు నమోదు చేయాలి

ఆదోని అగ్రికల్చర్ , జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధనాపురం గ్రామ దళిత సర్పంచ్‌ను బహిరంగ సభలో అవమానపరిచిన కూటమి ప్రజాప్రతినిధులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ కన్వీనర్ వెన్నెల మణికంఠ, పట్టణ ఇన్‌చార్జి గుమ్మల బాలస్వామి డిమాండ్ చేశారు. బుధవారం మాట్లాడుతూ ఈ నెల 16న ప్రజల కోసం పార్థసారథి కార్యక్రమానికి ఎమ్మెల్యే పార్థసారథి ధణాపురం గ్రామానికి వెళ్లారన్నారు. సర్పంచ్‌ను పైకి రావాలని ఎమ్మెల్యే కోరగా, కొందరు టీడీపీ ప్రజాప్రతినిధులు ఎస్సీ అంటూ ఎమ్మెల్యే చెవిలో చెప్పి అడ్డుకున్నారని ఆరోపించారు. మనోజ్, గిడ్డయ్య, బీమా మాదాసు, జగన్, అంజనప్ప, దతుత్త పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడే కమ్యూనిస్టులు



మాట్లాడుతున్న రామచంద్రయ్య

పత్తికొండ టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి):కమ్యూనిస్టులు పేదల కోసం పోరాడతారని సీపీఐ కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య అన్నారు. బుధవారం పెద్దహుల్తి గ్రామంలో సీపీఐ శాఖ మహాసభ నిర్వహించారు. స్వాతంత్ర్యానికి మునుపే 1925లో సీపీఐ ఆవిర్భవించిందన్నారు. భూసంస్కరణ అమలు, బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దు, వెట్టిచాకిరీ నుంచి విముక్తి కోసం పోరాటాలు చేసిందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడిచేలా మత రాజ్యాంగంగా మార్చేందుకు కుట్రలు చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా హామీలను అమలు చేయలేదన్నారు. రాజాసాహెబ్, గురుదాసు, కారన్న, కారుమంచి పాల్గొన్నారు.

శుభ్రమైన భోజనాన్ని వడ్డించాలి



భోజనాన్ని రుచిచూస్తున్న చైర్‌పర్సన్ లోకేశ్వరి

ఆదోని అగ్రికల్చర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు శుభ్రంగా, రుచికరంగా వడ్డించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి సూచించారు. బుధవారం పట్టణంలోని ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

రాజాయోగానంద ఆరాధన

ఆస్పరి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోహరాపురం గ్రామంలో రాజాయోగానంద 43వ ఆరాధన బుధవారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పీఠాధిపతులు గోపూజ, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు.

సౌత్‌జోన్ క్రికెట్‌కు పత్తికొండ విద్యార్థిని నిఖిత

పత్తికొండ టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో నిర్వహించనున్న సౌత్‌జోన్ క్రికెట్ పోటీలకు పట్టణానికి చెందిన విద్యార్థి లిఖిత ఎంపికయ్యారు. ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు నెల్లూరు అంతర్‌జిల్లా అండర్-15 మహిళల విభాగంలో జిల్లా తరుపున పాల్గొన్నారు. ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరచడంతో సౌత్‌జోన్ జట్టుకు ఎంపికచేశారు. విద్యార్థినిని శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యం అభినందించింది.



పశువైద్యాధికారిగా లక్ష్మన్న

మద్దికెర, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండల పశువైద్యాధికారిగా లక్ష్మన్న బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న కృష్ణ నాయక్ చిప్పగిరికి బదిలీ అయ్యారు. రైతులందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు.

ఎస్టీల అభివృద్ధికి ప్రభుత్వాల కృషి

మద్దికెర, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్టీల అభివృద్ధికి కృషి చేస్తున్నాయని షెడ్యూల్ తెగల డిప్యూటీ కలెక్టర్ పాకాల కొండయ్య అన్నారు. బుధవారం గ్రామాల్లో ఎస్టీలతో సమావేశం నిర్వహించారు. రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, కులధ్రువీకరణ దరఖాస్తు చేసుకున్న వెంటనే ఇస్తామన్నారు. ఎస్టీల అభివృద్ధికి మద్దికెర, పెరవలి, మదనంతపురం ఎంపికయ్యాయని, ప్రభుత్వం రాయితీ రుణాలు ఇస్తుంద న్నారు. డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్, ఏపీవో నర్సిరెడ్డి, కార్యదర్శి సుధాకర్ ఉన్నారు.

తహసీల్దార్‌గా రవి

తుగ్గలి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్‌గా ఎస్ రవి బాధ్యతలు స్వీకరించారు. డీటీ సుదర్శన్, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్ రెడ్డి, ఆర్ఐ వెంకట్రాముడులు తహసీల్దార్‌కు స్వాగతం పలికి సన్మానించారు. రైతుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. సర్వేయర్ సుధాకర్, వీఆర్వోలు నాగేంద్ర, రెహిమాన్, తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

● జాబ్‌మేళాలో 98మందికి ఉద్యోగాలు

పత్తికొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): యువత అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకు సాగితే విజయాలు సొంతమవుతాయని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృత్తినైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళాను ప్రారంబించారు. 16 కంపెనీల ప్రతినిధులు వచ్చారని, మన ఊరికే వచ్చిన అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదువు పూర్తయినా ఇంటివద్దే ఉంటూ తల్లిదండ్రులను ఇబ్బందిపెట్టకుండా ఉద్యోగాలు చేయాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్‌రాజ్ కుమార్ మాట్లాడుతూ 255 మంది అభ్యర్థులు హాజరుకాగా, 98 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. సాయితేజ, అల్తాఫ్, నాగప్ప కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కొరత తీరుస్తాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● హొలహొర్వి మండల విద్యాధికారి ఈరన్న



హొలహర్వి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధ్యాయుల కొరత తీరుస్తామని ఎంఈవో ఈరన్న అన్నారు.

ప్రశ్న: ఉపాధ్యాయుల కొరత తీర్చడానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జవాబు: ఉపాధ్యాయులు లేనిచోట వలంటీర్లను ఏర్పాటు చేశాం. పాఠశాలలు మూతపడకుండా చూస్తున్నాం.

ప్రశ్న: మధ్యాహ్న భోజనంలో వంట ఏజెన్సీలు అక్రమాలకు పాల్పడుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి?

జవాబు: మధ్యాహ్న భోజనం పథకంలో అక్రమాలకు పాల్పడితే వారిని తొలగించి నూతన ఏజెన్సీలను ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న: విద్యావ్యవస్థ ఎలా ఉంది?

జవాబు: మండలంలో విద్యావ్యవస్థ అధ్వానంగా ఉంది. మెరుగుపరచి, ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: అధ్వానంగా మారడానికి కారణాలు?

జవాబు: ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. మండలానికి వచ్చేందుకు ఉపాధ్యాయులు ఎవరూ ఇష్టపడడం లేదు. ఉన్నవారితోనే చదువులు కొనసాగిస్తున్నాం.

ప్రశ్న: తల్లికి వందనం పథకంలో ఎలాంటి సమస్యలు వచ్చాయి?

జవాబు: కుటుంబంలోని పిల్లలందరికీ ఇచ్చాం. కొన్ని సాంకేతిక కారణలతో ఒకే వ్యక్తి పేరుమీద 97 మంది విద్యార్థుల ఆధార్‌కార్డు ఉండటంతో సమస్య వచ్చింది.

ప్రశ్న: ఈ ఏడాది పదో తరగతితో చాలామంది విద్యా ర్థులు ఉత్తీర్ణత సాధించలేక పోయారు కారణాలేంటి?

జవాబు: పల్లెల్లో విద్యార్థులపై సెల్‌ఫోన్లు, టెలివిజన్ల ప్రభావం తీవ్రంగా ఉంది. తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలి. ఈ విషయంపై వారికి అవగాహన కల్పిస్తాం



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి



కార్యక్రమానికి హాజరైన పట్టణ, గ్రామీణ ప్రాంతవాసులు



నీట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, కూటమి నాయకులు

వ్యాపార రంగంలో రాణించాలి

- ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే బీవీ
- ఔత్సాహిక పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు అవగాహన సదస్సు

ఎమ్మిగనూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి ఇంటి నుంచి ఒకరు పారిశ్రామికవేత్తగా, వ్యాపారవేత్తగా ఎదగాలన్నదే సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ లక్ష్యమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని కుర్ని కమ్యూనిటీ హాల్‌లో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ యువతీ యువకులు, మహిళలకు ఉద్యోగావకాశాలే కాకుండా పారిశ్రామికంగా రాణించేందుకు ప్రభుత్వం తోడ్పాటునందిస్తుందన్నారు. సబ్సిడీపై దాదాపు 17 రకాల యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తుందని, ఇందుకు గాను ఆర్థికతోడ్పాటు, సాంకేతిక శిక్షణ, మార్కెటింగ్ సపోర్టు, ప్రభుత్వ గుర్తింపుకు అవసరమైన సూచనలు సలహాలు అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పారిశ్రామిక వేత్తలుగాను, వ్యాపారవేత్తలుగా ఎదగాలని కోరారు. అంతకు ముందు సెంచరియన్ యూనివర్సిటీ ప్రతినిధి ప్రొఫెసర్ అనిల్‌కుమార్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. సదస్సులో సెంచరీయన్ యూనివర్సిటీ ప్రతినిధి పార్థసారథి, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ సొసైటీ అధికారులు అశోక్‌కుమార్, అనిల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లయ్య, జనసేన పార్టీ ఇన్‌చార్జి రేఖాగౌడ్, బీజేపీ, టీడీపీ నాయకులు నరసింహులు, రైస్‌మిల్లు నారాయణరెడ్డి, మిఠాయి నరసింహులు, కౌన్సిలర్ రామదాసు గౌడ్, మహేంద్రబాబు, వీరేంద్ర, బుగిడే నాగరాజు, తురేగల్ నజీర్, సోమేశ్వర రెడ్డి, సురేష్ చౌదరి, షాలేమ్, జయన్న, ఉసేన్‌సాబ్, కటారి రాజేంద్ర, జగదీష్, రామవేంద్ర, రామకృష్ణ నాయుడులు పాల్గొన్నారు.

విద్యార్థులను సన్మానించిన ఎమ్మెల్యే

ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన పట్టణానికి చెందని కురువ రీతు అక్షయ, మాదుగుండు మౌనిక, జీ వెంకట సాయిలను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నవాజ్, గిరి, కురువ మద్దిలేటి, దేవేంద్ర, వాహీద్, గుప్త పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో జగన్‌కు ఒక్క సీటు రాదు

ఎమ్మిగనూరు : తన ఉనికిని చాటుకునేందుకు ప్రజలను మభ్యపెడుతున్న మాజీ సీఎం జగన్‌కు వచ్చే 2029ఎన్నికల్లో ఒక్కసీటు కూడా రాదని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి జోస్యం చెప్పారు. బుధవారం పట్టణంలోని కుర్నికమ్యూనిటీ హాల్ దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేశ్ చిత్రపటాలకు ఎమ్మెల్యే బీవీ, జనసేన ఇన్‌చార్జి రేఖాగౌడ్, బీజేపీ నాయకులు నరసింహులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ అమ్మఒడి పేరుతో కుటుంబంలో ఒక్క బిడ్డకు ఇస్తే కూటమి ప్రభుత్వంలో కుటుంబంలో ఉన్న పిల్లలందరికీ తల్లికి వందనం కింద ఒక్కోక్కరికి రూ. 13వేలు ఇచ్చిందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యారంగాన్ని నాశనం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలుచేస్తుంటే వైసీపీ నాయకులకు నిద్ర పట్టడం లేదన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో అమ్మఒడి కింద రూ. 13వేలు వేసిన సమయంలో రూ.2వేలు ఎవరి ఖాతాలోకి వెళ్లాయని ప్రశ్నించారు. పాఠశాలల అభివృద్ధి కోసం రూ. 15వేలలో రూ.2వేలు కేటాయిస్తే దాన్ని వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తు లబ్ధిపొందాలని చూస్తోందని విమర్శించారు. ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత ప్రయాణం పథకాలు వరుసగా అమలు చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కురువ మల్లయ్య, టీడీపీ నాయకులు రామదాసు గౌడ్, నరసింహులు, కటారి రాజేంద్ర, జయన్న, సలీం, బుగిడే నాగరాజు, కామార్తి మహేష్, కురువ మద్దిలేటి, మిన్నప్ప, దేవేంద్ర, దామా నరసింహులు, దేవమ్మ పాల్గొన్నారు.

విలీనం చేయొద్దు

- విద్యార్థులు, తల్లిదండ్రుల నిరసన



పాఠశాల తరగతులను తరలించొద్దని విద్యార్థులు, తల్లిదండ్రులు హైవే రోడ్డుపై ధర్నా

మంత్రాలయం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రామచంద్రనగర్ పాఠశాలలోని 3, 4, 5 తరగతులను సంత మార్కెట్ ప్రాథమిక పాఠశాలలోకి విలీనం చేయొద్దని, యథావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. బుధవారం ఎంపీటీసీ మేకల వెంకటేశ్, అశోక్ రెడ్డి, కంసాలి నరసింహ, ఉన్నత పాఠశాల చైర్మన్ నరసింహులు, రాఘవేంద్ర పాఠశాల విలీనం రద్దు చేయాలని ఎంఈవోకు మెమోరాండం ఇచ్చారు. అంతతో ఆగకుండా తమ పిల్లలతో కలిసి అంబేడ్కర్ సర్కిల్ హైవే రోడ్డుపై ధర్నా చేపట్టారు. విలీనం నిలిపివేసి పాఠశాలలోనే తరగతులు కొనసాగించాలని నినాదాలు చేశారు. ధర్నాలో పాఠశాల కమిటీ చైర్మన్ చిట్టెమ్మ, అంబిక, పరిమళ, లక్ష్మి, గౌరి, మహేశ్వరి, హేమలత, దేవమణి, సుకన్య, శాంతమ్మ, ప్రశాంతి, తాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలను కొనసాగించాలి

- తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ

మంత్రాలయం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సేవలు కొనసాగే విధంగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని ఆర్‌డీటీ సభ్యులు కోరారు. బుధవారం సభ్యులు శ్రీనివాసులు, ఆదామ్ మాట్లాడుతూ గురువారం ఆర్డీటీ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక రాఘవేంద్ర సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంతాలను ఆర్‌డీటీ దత్తత తీసుకుని అనేక మంది అనాథలు, పేదల కోసం సేవ చేస్తున్న వాటిని గుర్తించకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డు పడిందని ఆరోపించారు. ఈ శాంతియుత ర్యాలీకి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బసాపురం తండా, రాంపురం, పరమాన్‌దొడ్డి, సుంకేశ్వరి, బూదూరు, చిలకలడోన గ్రామాల సభ్యులు కోరారు.

కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



ప్రైవేట్ కళాశాల ముందు ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, జూన్18(ఆంధ్రజ్యోతి): విద్యను వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శి విష్ణు, ఖాదర్, డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాల ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో ఫీజులు రూ. లక్షల్లో వసూళ్లు చేస్తున్నారేగాని వసతులు మాత్రం కల్పించడంలేదన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కళాశాలలు నడుపుతున్నా ఎందుకు విద్యాధికారులు స్పందించడంలేదని ప్రశ్నించారు. కళాశాలలో పుస్తకాలు, బట్టల వ్యాపారాలను ప్రారంభించారన్నారు. పుస్తకాలకు రూ.10వేలు, దుస్తులకు రూ.20వేలు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను నిలువునా దోపిడి చేస్తున్నారన్నారు. వెంటనే కళాశాలపై చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ సహాయ కార్యదర్శి దస్తగిరి, నాయకులు సమీర్, బడేసాబ్, శ్రీను, సుంమత్, ఉదయ్, భార్గవ్ పాల్గొన్నారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సెట్కూరు సీఈవో వేణుగోపాల్

మంత్రాలయం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సమాజంలో జరుగుతున్న ఆర్థిక సైబర్ క్రైం మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సెట్కూరు సీఈవో డా. వేణుగోపాల్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ క్రైం నేరాలు, మహిళల అక్రమ రవాణా, డ్రగ్స్ దుష్పరిణామాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త టెక్నాలజీ పేరుతో అనేక మోసాలు జరుగుతున్నాయన్నారు. సైబర్ నేరగాళ్ల చేత మోసపోతే వెంటనే 1930కి ఫోన్ చేసి సహాయం పొందాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ రమేష్, మద్దిలేటి, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కౌతాళం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కౌతాళం హెడ్‌కానిస్టేబుల్ సోమ్లనాయక్ తెలిపారు. మండల కేంద్రమైన కౌతాళంలో బుధవారం ఎన్టీఆర్ నగర్ కాలనీలో ప్రజలకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సైబర్ మోసాలు ఎక్కువైతున్నాయని, ప్రజలకు ఆశ చూపి మోసాల రూపంలో నగదును స్వాహా చేస్తున్నారన్నారు. ప్రజలు ఎవరు కూడా కొత్త నెంబరుపై వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. మోసగాళ్లు మీ సెల్‌ఫోన్‌లకు ఓటీపీలు అడుగుతూ నగదును ఖాళీ చేస్తున్నారని తెలిపారు. మహిళలు కూడా సైబర్ మోసాలపై అవగాహన ఉండాలన్నారు. సదస్సులో పోలీసులు మధుసుధన్ కాలనీవాసులు పాల్గొన్నారు.

వైసీపీ బలోపేతానికి కృషి చేస్తా : రాజారత్నం

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వైసీపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ రాష్ట్ర సాంస్కృతిక ప్రధాన కార్యదర్శి రాజారత్నం అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర సాంస్కతిక ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు వైఎస్ఆర్ సీపీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు అందినట్లు తెలిపారు. పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకానికి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి, బుట్టారేణుకాకు ధన్యవాదాలు తెలిపారు.

విద్యకు అధిక ప్రాధాన్యం



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓలు టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు

మంత్రాలయం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎంపీటీసీ మేకల వెంకటేష్ అన్నారు. బుధవారం మంత్రాలయం జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం అంపయ్య ఆధ్వర్యంలో ఎంఈవోలు షైనుద్దీన్, రాగన్న, పాఠశాల కమిటీ చైర్మన్ నరసింహులు విద్యార్థినులకు పాఠ్య, నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బడీడు పిల్లలు బడిలో ఉండాలన్న ఉద్దేశంతో ఉచితంగా పుస్తకాలు, యూనిఫామ్, తల్లికి వందనం, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, కొత్త ఉపాధ్యాయులు నియామకం చేపట్టిందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత పెరిగేందుకు విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ ప్రత్యేకదృష్టి సారించారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అశోక్‌రెడ్డి, కంసాలి నరసింహులు, రాఘవేంద్ర, శివ, ఉపాధ్యాయులు వీరోబరావు, గోట్ల చంద్రశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ రవీంద్ర, నరసింహరాజు, గోపాల్, అన్వర్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయండి

గోనెగండ్ల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో మణిమంజరి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో సమావేశ భవనంలో మండలంలోని ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మే 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్రగా గుర్తించిందని, అందుకు గాను ప్రతి గ్రామంలో యోగా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఈనెల 21న యోగా కార్యక్రమం నిర్వహించాలని యోగా ద్వారా కలిగే లాభాలు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రామాంజినేయులు, పలు గ్రామాల ఉపాధ్యాయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి



గోనెగండ్లలో నిలిచిపోయిన గృహాలను పరిశీలిస్తున్న తహసీల్దార్, హౌసింగ్ డీఈ

గోనెగండ్ల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో నిధులు అందక నిలిచిపోయిన గృహాలకు ఈ ప్రభుత్వం నిధులను విడుదల చేస్తుందని, త్వరగా గృహనిర్మాణాలను పూర్తి చేయాలని తహసీల్దార్ రాజేశ్వరి, హౌసింగ్ డీఈ ప్రసాద్, హౌసింగ్ ఏఈ షేక్షావలి లబ్ధిదారులను కోరారు. బుధవారం స్థానిక కేజీబీవీ పాఠశాల అవరణలో నిలిచిపోయిన గృహాలను విద్యుత్‌లైన్‌లు, రోడ్లను వారు పరిశీలించారు. గృహనిర్మాణాలను మధ్యలోనే నిలిపివేసిన లబ్ధిదారులతో మాట్లాడారు. ఎన్ని నిర్మాణ పనులు పూర్తయ్యాయి, ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని హౌసింగ్ అధికారులను తహసీల్దార్ అడిగి తెలుసుకున్నారు. మండలంకు 1176 గృహాలు మంజూరు అయ్యాయని అందులో 443 గృహనిర్మాణ పనులు పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : సచివాలయంలోని పెండింగ్‌లో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సీపీఎం పట్టణ నాయకుడు రాముడు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ శివన్న నగర్‌లో బడుగు, బలహీన వర్గాల వారు అధికంగా నివసిస్తున్నట్లు తెలిపారు. శివన్న నగర్‌లోని సచివాలయంలో కాలనీ వాసులు రేషన్ కార్డులో మార్పులు చేర్పులు, భర్త చనిపోయిన పెన్షన్లు, పేర్ల మార్పులు, ఇంటికి పన్నుల నమోదు విషయంలో అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్య ధోరణి వీడి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, మోహన్, లక్ష్మన్న పాల్గొన్నారు.

సమస్యలను గాలికొదిలేసిన ప్రభుత్వం



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి నర్సన్న

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి నర్సన్న, రైతు కూలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్రం సమస్యలతో పోరాడుతుంటే చంద్రబాబు యోగాంధ్రలో కార్యక్రమంలో సమయం గడుపుతున్నారన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకుడు ఏసేపు, ఐఎఫ్‌టీయూ నాయకుడు అనీఫ్ పాల్గొన్నారు.

ఇంటినెంబర్ ఆధార్‌కు అనుసంధానం చేసుకోవాలి



మాట్లాడుతున్న సర్పంచ్ హైమావతి

గోనెగండ్ల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ ఇంటి నెంబర్ ఆధార్ నెంబర్‌తో అనుసంధానం చేసుకోవాలని గోనెగండ్ల సర్పంచ్ హైమావతి అన్నారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఇంటి ని ఆధార్ అనుసంధానంతో ఆన్‌లైన్‌లో చేర్చబడుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెండు రోజులుగా కాలువలో నిండిన చెత్తను, ముళ్ల పొదలను ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్‌లతో తొలగిస్తున్నామన్నారు. గ్రామంలో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపడుతున్నారని, అందుకు గ్రామాల ప్రజలు కూడా సహకరించాలన్నారు. ఈ ఏడాది గ్రామస్థులు ఇంటి, నీటి పన్నులు, దుకాణాల లైసెన్స్‌ల పన్నులు పంచాయతీ కార్యాలయానికి చెల్లించాలన్నారు. వందశాతం పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి సతీష్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మలాంగ్‌బాషా, అనిల్, సుబాన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ నాయకులకు మతి భ్రమించింది



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నందవరం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులకు మతిభ్రమించిందని క్లస్టర్ ఇన్‌చార్జి మాచాపురం కాశీంవలి, మండల కన్వీనర్ చిన్నరాముడు, రైస్ మిల్లు నారాయణరెడ్డి, సత్తిరెడ్డి ఆరోపించారు. బుధవారం వారు మాట్లాడుతూ జగన్ పాలనలో అన్ని అవినీతి మయం అయ్యాయన్నారు. తల్లికి వందనం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికి డబ్బులు జమ చేసిన ప్రభుత్వం టీడీపీ అని వారు గుర్తుచేశారు. నిరుద్యోగులకు డీఎస్సీ విడుదల చేసిన ఘనత టీడీపీది అన్నారు. ప్రతి నిరుపేద ఇంటికి ఏడాదికి మూడు సిలిండర్‌లు ఉచితంగా ఇచ్చినది తెలుగుదేశం పార్టీయే అని గుర్తు చేశారు. వైసీపీ నాయకులకు మతిభ్రమించి మతిలేని మాటలు మాట్లడుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంపై చిన్నచూపు

నందవరం, జూన్ 18((ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగంపై చిన్నచూపు చూస్తుందని వైసీపీ మండల కన్వీనర్ శివారెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరూపాక్షిరెడ్డి అన్నారు. బుధవారం నందవరంలో మాట్లాడుతూ రైతులకు సేవ చేసేందుకు జగన్ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. అందులో ఉన్న ఉద్యోగులు రైతులకు పూర్తిస్థాయిలో సమాచారం అందించే వారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 10,641 రైతు భరోసా కేంద్రాలను జగన్ ఏర్పాటు చేశాడన్నారు. ఈ కేంద్రాల ద్వార రైతులకు అవసరమైన సేవలు, నిపుణుల సలహాలు, మార్కెట్ ధరలు, ఎరువులు, విత్తనాలు అందించే వారన్నారు. ఇప్పుడు అలాంటి సౌకర్యాలు ఏమీ లేవని వారు విమర్శించారు. కౌలు రైతుల పరస్థితి దారుణంగా ఉందన్నారు. కార్యక్రమంలో లక్ష్మీకాంతరెడ్డి, జడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, చాంద్‌బాషా, శ్రీనివాసరెడ్డి, రామకోటేశ్వరరెడ్డి, ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

43వ రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మొండి వైఖరి వీడి, మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు 43వ రోజులుగా సమ్మె చేపట్టారు. బుధవారం మునిసిపల్ కార్యాలయం ఎదుట కూర్చొని నినాదాలు చేస్తూ తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం మొండి వైఖరి వీడి రాష్ట్ర కమిటీ చర్చలు జరపాలని, లేనిపక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శివరామకృష్ణ, వెంకటేశులు,నరసింహులు, కేసన్న, రాజేంద్ర, నరసప్ప, విజయ్‌కుమార్, శ్రీరాములు, పంపాపతి, సాయి, విజయ్, బాషా, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఇస్మాయిల్, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పారిశుధ్య కార్మికులు వాడవాడ తిరిగి వీధులను శుభ్రపరుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం అమలు చేయడంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుందన్నారు. మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు కూడా తల్లికి వందనం సంక్షేమ పథకాలు అమలు చేయాలని మునిసిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కేసన్న, ఖాజా, మునీంద్ర, రంగస్వామి పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

ఎమ్మిగనూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని ది ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘంలో సభ్యులుగా చేరేందుకు ఆసక్తి, అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సంఘం కార్యదర్శి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈనెల 30వ తేదీలోపు సంఘం కార్యదర్శికి సమర్పించాలన్నారు. దరఖాస్తుదారుడు మగ్గం కలిగి ఉండాలని, మాస్టర్ వీవర్స్ అయి ఉండరాదని, ప్రవేశరుసుము రూ. 100 ఉంటుందన్నారు. అలాగే సంఘం అభివృద్ధికి కృషిచేయాలన్నారు. 18ఏళ్ల నిండినవారై ఉండాలని, ఎమ్మిగనూరు, గుడికల్లు, నందవరం, నాగలదిన్నే, గోనెగండ్ల, కోసిగి, గూడూరు, ప్రాంతాలలో నివాసం ఉండాలన్నారు. ఈ అర్హతలు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వెండి గజ వాహనంపై ప్రహ్లాదరాయలు



గజవాహనంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి గజవాహనంపై విహరించారు. జ్యేష్ఠ మాస సప్తమి బుధవారం శుభదినాన్ని పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి, మంచాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య వెండి గజవాహనంపై స్వర్ణ అంబారిలో వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్ఠించి పీఠాధిపతి మహామంగళహారతితో ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం స్వామి వారికి ఊంజల సేవ నిర్వహించారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

రాఘవరాయడికి స్వర్ణ కవచ సమర్పణ సేవ

వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద స్వామి మూల బృందావనానికి బంగారు కవచ సమర్పణ సేవ రమణీయంగా సాగింది. బుధవారం సప్తమి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో మఠం పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో అలంకరించారు. పీఠాధిపతి హస్తోదకం చేసి మహా మంగళహారతులు ఇచ్చారు.

ఉత్తమ రైతుకు సన్మానం



ఉత్తమ రైతు దివాకర్‌ను అభినందిస్తున్న శాస్త్రవేత్తలు

ఎమ్మిగనూరు రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో ఉత్తమ రైతు దివాకర్‌ను ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి శాలువ, పూలమాల, మెమొంతో సన్మానించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త రాఘవేంద్ర చౌదరి మాటట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలోని వెంకటాపురం కాలనీకి చెందిన రైతు దివాకర్ ఏడేళ్ల నుంచి వేరుశనగ ధరణి, కె6, ఐసీజీవీ-0035, దీరజ్, కదిరి, లేపాక్షి, టీసీజీఎస్-1694 వేరుశనగ రకాలను సాగు చేసి అధిక దిగుబడులు సాధించారన్నారు. అలాగే సాగులో మెలకువలు నేర్చుకొని తోటి రైతులకు నేర్పుతున్నారన్నారు. దీంతో ఆచార్య ఎన్జీ రంగ విశ్వవిద్యాలయం, ఈసీ, ఆర్.ఐ పంప్స్ రైతు పురస్కారాల్లో భాగంగా ఉత్తమ రైతుగా ఎంపికై రూ.10వేల నగదుతో పాటు మెమొంటో, ప్రశంసాపత్రం అందించిందన్నారు. ప్రతి రైతు ఆదర్శరైతుగా నిలిచేలా పంటలను సాగుచేయాలన్నారు. కార్యక్రమంలో బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు రోజులు వర్షసూచనలు లేనట్టే

ఎమ్మిగనూరు రూరల్, జూన్18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మరో ఐదు రోజుల పాటు వర్షసూచనలు లేవని మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 18,19,20,21,22వ తేదీల్లో వర్ష సూచనలు లేవన్నారు. జిల్లాలో ఆకాశం మేఘావృతమై 1మీ.మీ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు మాత్రమే ఉన్నాయన్నారు. రైతులు గమనించిన పంటపొలాల్లో పనులను చేసుకోవాలన్నారు.

ఈ కేవైసీ నమోదు చేసుకోవాలి

ప్రతిరైతు ఈకేవైసీని నమోదు చేయించుకోవాలని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి సూచించారు. ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న సంక్షేమ పథకాలు, సబ్సిడీలు అందాలంటే తప్పకుండా ఈకేవైసీని నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.